

ఉత్తరాంధ్ర

నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

ఆదివారం 26-5-2024 పేజీలు 5

విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం

విజయనగరం శ్రీకాకుళం


# స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**విశాఖపట్నం, మే 25, మేజర్‌న్యూస్:** ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్లను రోజువారీ తనిఖీలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున శనివారం ఉదయం పరిశీలించారు. పోలీసు జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప, ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్ లతో కలిసి పార్లమెంటు, అంసెబ్లీ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. సీసీ కెమెరాల మిగతా 2లో

# అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్..!

## - ఏ పార్టీ గెలుస్తాదోనని జనాల్లోనూ తెగని ఉత్కంఠ -మంత్రి పదవుల కోసం ఆశావహులు...! -చాంతాడులా పెరుగుతున్న జాబితా



**విశాఖపట్నం, మే 25, మేజర్‌న్యూస్:** ఎన్నికల ఫలితాల కౌంట్ డౌన్ సమీపిస్తుండడంతో అందరిలోనూ ఒకటే టెన్షన్...ఎవరికి వారు లోలోన టెన్షన్ పడుతున్నారు. అభ్యర్థులు గెలుస్తామో లేదోనని టెన్షన్ పడుతుంటే...ప్రజలు కోరుకున్న పార్టీ గెలుస్తాదా లేదా అన్నది బేరీజు వేసుకుంటున్నారు. కచ్చితంగా గెలిచి తీరుతామని నమ్మకంతో ఉన్న అభ్యర్థులైతే మంత్రి పదవి వస్తాదా లేదా అన్న టెన్షన్ తో ఉన్నారు. ఎవరైతేనేమీ మొత్తానికి ఓట్లేసిన వారు...ఓట్లేయిం చుకున్న వారు కూడా టెన్షన్‌తో ఇబ్బంది పడుతున్నారు. ఈ టెన్షన్ ఈ నాటిది కాదు...ఎన్నికలకు ముందు పార్టీ సీటు ఇస్తుందో లేదోనని పడినప్పటి నుంచీ ఈ టెన్షన్ కొనసాగుతూ.....నే ఉంది. ఓటరు మాత్రం స్థిరంగా అన్ని పార్టీలను బురిడీ కొట్టించి తాను అనుకున్న పార్టీకి ...అనుకున్న అభ్యర్థికి ఓటేసి జై కొట్టాడు. ఆ ఓటు ఎవరికి అనేది తేలడానికి ఇంకొన్ని రోజులు సమయం పడుతూంది. ఈ లోగా టెన్షన్ మాత్రం ఓ రేంజ్‌లో ఆటాడుకుంటోంది. రూ. కోట్లు వెచ్చించిన అభ్యర్థులకు ఓ టెన్షన్ ఉంటే...వారి అనుయాయుల్లోనూ తమ నేత విజయాపజయాలపై జరుగుతున్న బెట్టింగ్ తంతును చూసి టెన్షన్ పడుతున్నారు. ఇది అన్ని పార్టీల్లోనూ ఈ టెన్షన్ కొనసాగుతూంది. గత కొద్ది రోజులుగా పార్టీల విజయావకాశాలపై చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది. ఏ పార్టీ విజయం సాధిస్తుందో చెప్పేసుకుంటున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు అలాంటి ప్రచారం జరుగకూడదు కానీ ... అనధికారికంగా మాత్రం ఏ పార్టీ గెలుస్తుందోనని ఊహాగానాల ప్రచారం అయితే ఊపందుకుంది. ఇంతకీ ఏ పార్టీ గెలిచినా మంత్రి పదవుల కోసం విశాఖ వాసులు పెద్ద ఎత్తున ఆశ పడుతున్నారు. వైసీపీ నుంచి అయితే చాంతాడులా ఆ పదవి ఆశించే వారున్నారు. విశాఖ అర్బన్ నుంచే కాకుండా గ్రామీణ ప్రాంతం నుంచి కూడా పోటీ తీవ్రంగానే ఉండేలా ఉంది. వైసీపీ నుంచి రెండో సారి గెలిచిన వారంతా ఈ దఫా మంత్రి పదవి కోసం ఆశలు పెట్టుకున్నారు. అందుకోసం ప్రయత్నాలను తీవ్రతరం చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వారైతే టీడీపీ...వైసీపీ నుంచి కూడా గట్టి పోటీ ఉన్నట్టు కనిపిస్తోంది. అయితే ఈ సారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కలసి పోటీ చేయడంతో టీడీపీకి ఆ కూటమి అభ్యర్థుల నుంచి మాత్రం తీవ్ర మిగతా 2లో

# ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు



-నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి

-జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

-కౌంటింగ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం

**విజయనగరం బ్యూరో, మే 25, మేజర్‌న్యూస్:** జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు మొదలవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ ప్రక్రియ ఉదయం 8 గంటలకల్లా ఖచ్చితంగా ప్రారంభించాలని ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బంది అంతా ఉదయం 6 గంటలకే లెక్కింపు కేంద్రాలవద్దకు చేరుకొని, అన్ని ఏర్పాట్లు పూర్తిచేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మొదలైన తరువాత, ఉదయం 8.30 గంటలకు ఈవిఎం ఓట్ల లెక్కింపును మొదలు పెట్టాలని చెప్పారు. ఓట్లను లెక్కించే కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో మొదటి విడత శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. లెక్కింపు ప్రక్రియలో వివిధ న్యాయపరమైన అంశాలు, సిబ్బంది విధులు, నిబంధనలు, కౌంటింగ్ హాళ్లు, పోస్టల్ బ్యాలెట్లు, ఇవిఎం ఓట్లు లెక్కించే విధానం, టేబుళ్ల ఏర్పాటు, చెల్లని ఓట్లు, చెల్లినవి గుర్తించడం, వాటిని వేరు చేయడం, ఫలితాలను నింపడం, బోర్డుపై వెల్లడించడం, అవసరమైన పత్రాలను పూర్తి చేయడం, తిరిగి ఇవిఎంలను సీల్ చేయడం, స్ట్రాంగ్ రూములోకి తరలించడం తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేపట్టే చివరి ఘట్టం ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో కౌంటింగ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా, నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడా సొంత నిర్ణయాలను తీసుకోకూడదని స్పష్టం చేశారు. ఎక్కడా చిన్నపాటి పొరపాటు కూడా జరగకుండా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. దీనికోసం మొత్తం లెక్కింపు ప్రక్రియ పట్ల పూర్తి అవగాహన ఏర్పరుచుకోవాలని సూచించారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏడు కేంద్రాలు, మొత్తం పార్లమెంటు స్థానం ఓట్ల లెక్కింపు కోసం లెండి కళాశాల లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ పోస్టల్ ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో కేంద్రంలో నాలుగు టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పార్లమెంటు స్థానం పోస్టల్ ఓట్ల లెక్కింపు కోసం 20 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ సిబ్బంది గానీ, ఏజెంట్లు గానీ, ఇతర అధికారులు గానీ, ప్రతీఒక్కరూ తప్పనిసరిగా ఫొటో గుర్తింపు కార్డు కలిగి ఉండాలని, విధులను నిర్వహించే రోజంతా దీనిని తప్పనిసరిగా ధరించాల్సిందేనని తెలిపారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈవిఎంలలో ఓట్లను లెక్కించడానికి ప్రతీ అసెంబ్లీ నియోజక వర్గానికి ఒక కేంద్రం, ఆ నియోజకవర్గంలో పార్లమెంటుకు పోలైన ఓట్ల లెక్కింపు కోసం మరో లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈవిఎం ఓట్ల లెక్కింపు కేంద్రంలో మిగతా 2లో

### అసాంఘిక శక్తులను ఎదుర్కొన్నందుకే

# మాబ్ ఆపరేషన్ - మాక్ డ్రిల్

## -అల్లర్లు,హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు -జిల్లా ఎస్పీ జి ఆర్ రాధిక -ఆకట్టుకున్న పోలీసులు మాబ్ ఆపరేషన్



**శ్రీకాకుళం, మే 25, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికలు -2024 ఓట్లు కౌంటింగ్ నేపథ్యంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నా,అల్లరి మూకలు విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో జిల్లా పోలీసులు సన్నద్ధత, దీటుగా ఎదుర్కొనుట ముఖ్య ఉద్దేశంగా జిల్లా ఎస్పీ శ్రీమతి జి ఆర్ రాధిక వారు పర్యవేక్షణలో జిల్లా ఆర్మ్డ్ రిజర్వు పోలీసులు శనివారం ఉదయం శ్రీకాకుళం పట్టణంలో డే అండ్ నైట్ కూడలి వద్ద మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ముందుగా మిగతా 2లో

# మావోయిస్టులు అమర్చిన డంపు స్వాధీనం

## జిల్లా ఎస్ పి తుహిన్ సిన్హా వెల్లడి



**పాడేరు, మే 25, మేజర్‌న్యూస్:** సీతారామరాజు జిల్లా, జి.కె. వీధి మండలం, గాలికొండ పంచాయితీ, సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల పనసలబంద గ్రామ పరిసర అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్న పోలీసు పార్టీలను టార్గెట్ చేస్తూ హతమార్చాలనే ఉద్దేశ్యంతో నిషేధిత సి.పి.ఐ మావోయిస్టు పార్టీ సీనియర్ కేడర్ పెట్టిన డంపును ముందుగా పసిగట్టి గుర్తించి కూంబింగ్ పార్టీ పోలీసులు వెలికి తీయడమైనది. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్ పి తుహిన్ సిన్హా తన కార్యాలయంలో విలేకర్ల మిగతా 2లో

### గుత్తేదారును సినీ పక్కిలో

# మోసం చేసిన నకిలీ పోలీసులు

## - నరసన్నపేట సీఐ ఆధ్వర్యంలో రాబరీ కేసు కొలిక్కి - నిందితులను అదుపులోకి తీసుకొని సొమ్ము రికవరీ - కేసు వివరాలను వెల్లడించిన డిఎస్‌పి బాలచంద్రారెడ్డి



**నరసన్నపేట, మే 25, మేజర్‌న్యూస్:** అనకాపల్లి ప్రాంతానికిచెందిన ఒక గుత్తేదారు వద్ద సారవకోట మండలం ధర్మ లక్ష్మీపురం సమీపంలో పోలీసులమని చెప్పి 10 లక్షల రూపాయలు తస్కరించిన కేసును నరసన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ బి ప్రసాద రావు ఆధ్వర్యంలో చాకచక్యంగా ఛేదించి కేసును కొలిక్కి తీసుకొచ్చిన పోలీసులు. నరసన్నపేట పోలీస్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ బాలచంద్రారెడ్డి కేసు చేదించిన విధానాన్ని వివరించారు. ఈనెల 18వ తేదీన నక్కల మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని కేసుని పరిశీలించి పోలీసులు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని వారి నుండి నాలుగు లక్షల 80 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నామని, వారి ఉపయోగించిన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలియజేశారు. నక్కల మణికంఠ అనే గుత్తేదారు తన దగ్గర పనిచేసే సూపర్వైజర్ బిడ్డిక యువరాజు అనే అతను మాటలు నమ్మి స్థలం కొనేందుకు 10 లక్షల రూపాయలతో ఈనెల 18వ తేదీన సారవకోట ప్రాంతానికి రావడం జరిగిందని, స్థలాన్ని చూసే క్రమంలో యువరాజ్ ద్వారా విషయం తెలుసుకున్న కొంతమంది నిందితులు పథకం ప్రకారము పోలీసులమని చెప్పి తనిఖీ పేరిట హంగామా చేసి, ఎన్నికల సమయంలో నగదు ఉండడం నేరమని స్వాధీనం చేసుకొని అక్కడినుండి ఉడయించారు. మోసపోయామన్న తెలుసుకున్న గుత్తేదారు మణికంఠ అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు కేసును దర్యాప్తు చేసి 12 మంది నిందితులు గా గుర్తించారని, అందులో ఆరుగురిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని కేసును చేదించడంలో నరసన్నపేట సీఐ ప్రసాదరావు చొరవతో వ్యవహరించడం, సారవకోట ఎస్సై సిబ్బంది శ్రమించి కేసు కొలిక్కి తీసుకొచ్చినట్లు తెలియజేశారు.

### ఉత్తరాంధ్రాలో రూ.2 వేల కోట్ల

# అసైన్డ్ భూములు హాంఫట్

## - కీలక పాత్ర పోషించిన సీఎస్ జవహర్ రెడ్డి - విశాఖలో కుమారుడ్ని పెట్టి 800ఎకరాలకు పైగా డీల్స్ - జీవో 596పేరిట చక్రం తిప్పిన అధికారులు - జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్




**విశాఖపట్నం, మే 25, మేజర్‌న్యూస్:** ఉత్తరాంధ్ర జిల్లాల్లో రూ.2వేల కోట్ల విలువైన అసైన్డ్ భూములు హాంఫట్ అయిపోయాయని, తెరవెనుక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి చక్రం తిప్పారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. విశాఖలోని పౌర గ్రంథాలయంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఇటీవల జవహర్ విశాఖ వచ్చి అనేక డీల్స్ చేశారని, భోగాపురం ఎయిర్ పోర్ట్ పనుల పరిశీలన పేరిట, ఇక్కడే జగన్ మళ్ళీ ప్రమాణ స్వీకారం చేస్తారని, ఆ ఏర్పాట్లు చూసేందుకు వచ్చానని చెప్పడంపై మూర్తి యాదవ్ అనుమానం వ్యక్తం చేశారు. మరో నెల రోజుల్లో పదవీ విరమణ చేయనున్న జవహర్ రెడ్డి ఇప్పటికే ఉత్తరాంధ్రా జిల్లాల్లో సుమారు రూ.1000కోట్ల విలువైన 400ఎకరాల ఎస్సీ, బీసీల అసైన్డ్ భూముల్ని తన కుమారుడ్ని అడ్డంపెట్టి బినామీల పేరిట చేజిక్కించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ వేదికగా ఆ భూముల్ని రిజిస్ట్రేషన్ చేయించేందుకే ఇప్పుడు యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారని విమర్శించారు. ఏపీలో పోలింగ్ రోజున, అనంతరం రాష్ట్రమంతా హింసతో అట్టుడికిపోతుంటే ఆయన మాత్రం మిగతా 2లో

# వాయుగుండంగా మారిన తీవ్ర అల్పపీడనం

## తుపానుకు 'రేమాల్'గా నామకరణం



**పలాస/మందస, మే 25, మేజర్‌న్యూస్:** ఎండలు మండిపోతున్న వేళ విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం చల్లటి కబురు చెప్పింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది క్రమంగా బలపడి తీవ్రవాయుగుండంగా ఆ తర్వాత తుపానుగా మారే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇది ఈశాన్య దిశగా పయనిస్తుందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం పేర్కొంది. ఇది క్రమంగా బలపడి తుపానుగా ఈనెల 26వ తేదీ రాత్రికి బర్మా సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ తుపాను ప్రభావంతో ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లో పలుచోట్ల సాధారణం నుంచి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. ఈ తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్ మీద పెద్దగా ఉండదని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం పేర్కొంది. కాగా ప్రస్తుతం ఉత్తర కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా చెదురు మదురుగా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వెల్లడించింది. రాష్ట్రంలో మిగతా జిల్లాలలో ఎండల తీవ్రత కొనసాగుతోందని, రెండు రోజుల తర్వాత పొడిగాలుల తీవ్రత కూడా ఉంటుందని హెచ్చరించింది. ప్రస్తుతం అన్ని పోర్టులకు ఒకటో నెంబర్ హెచ్చరిక కొనసాగుతోందని, మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారిణి సునంద వెల్లడించారు.లి ఆంధ్రప్రదేశ్‌పై 'రేమాల్' తుపాను ప్రభావం ఉండదు : పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం 24 గంటల్లో తుపానుగా మారే అవకాశం ఉందని విశాఖ వాతావరణశాఖ అధికారులు తెలిపారు. తుపానుకు 'రేమాల్'గా నామకరణం చేసినట్లు వెల్లడించారు. అది ఈశాన్య దిశగా కదిలి బంగ్లాదేశ్ వద్ద 27వ తేదీ అర్ధరాత్రి దాటాక తీరం దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒడిశా, బంగాల్, బంగ్లాదేశ్‌పై తుపాను ప్రభావం ఉంటుందని తెలిపారు. మధ్య బంగాళాఖాతంలో సముద్రం ఆటుపోట్లకు గురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో మత్స్యకారులెవరూ వేటకు వెళ్లొద్దని సూచించారు. అన్ని పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలు జారీ చేసినట్లు విశాఖ వాతావరణశాఖ అధికారి డాక్టర్ సునంద తెలిపారు. తుపాను ప్రభావం రాష్ట్రంపై ఉండదని, అత్యధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వివరించారు. తుపాను ప్రభావంతో రుతుపవనాలు వేగంగా కదులుతున్నాయని వాతావరణశాఖ పేర్కొంది. నైరుతి రుతుపవనాలు శ్రీలంక వరకు విస్తరించాయని వెల్లడించింది.

# ఉత్తరాంధ్రాలో రూ.2 వేల కోట్ల అస్సైన్డ్ భూములు హాంఫట్

(మొదటి పేజీ తరువాయి)

ఏమీ పట్టనట్టే వ్యవహరించారని, భూ రిజిస్ట్రేషన్ల వ్యవహారాన్ని చక్కదిద్దేందుకే ఆయన ఇటీవల విశాఖ విచ్చేశారని ఆరోపించారు.

**జీవో నంబర్ 596ను అడ్డం పెట్టుకునే..**

నాఎస్సీలు, నా బీసీలు అని తరచూ సీఎం జగన్ తన అనుయాయులకు లబ్ధి చేకూరేలా జీవో నంబర్ 596ను విడుదల చేశారని, దాని ప్రకారం అసైన్డ్ భూముల్ని వారి వారసులు, అనుభవదారులకు ఫ్రీహోల్డ్ సర్టిఫికేట్ జారీ చేసి భూమిపై సర్వ హక్కులు కల్పించారని మూర్తి యాదవ్ గుర్తు చేశారు. అంటే సర్టిఫికెట్ జారీ అయితే భూముల్ని 22ఏ నుంచి తక్షణమే తప్పించేలా సెక్షన్ 35 ఆఫ్ 2023 పేరిట చట్టం చేశారన్నారు. దీనినే ఆసరాగా చేసుకొని జీవో రాకముందే జవహార్ రెడ్డి అసైన్డ్ భూములు ఎక్కువగా ఉన్న విశాఖ, విజయనగరం జిల్లాలపై కన్నేసి తన కుమారుడ్నే రంగంలోకి దింపారని ఆరోపించారు. సుపుత్రుడు కూడా ఒక ముఠాను రంగంలోకి దింపి జనాన్ని బెదిరించి, భయపెట్టి ఐదు, పది లక్షల రూపాయలకే ఎకరా చొప్పున కొన్ని వందల ఎకరాలకు అగ్రిమెంట్లు చేసుకున్నారని స్పష్టం చేశారు. బహిరంగ మార్కెట్లో ఎకరా రెండు కోట్లకుపైగా ఉన్న చోట కూడా కేవలం ఐదారు లక్షలకే జవహార్ రెడ్డి ముఠా ఒప్పందాలు కుదర్చుకుని అడ్వాన్సులు ముట్ట జెప్పిందన్నారు.

**వైసీపీ ప్రభుత్వం రాదనే భయంతోనే రిజిస్ట్రేషన్లు..**

పోలింగ్ వరకూ ఈ భూముల గురించి పట్టించుకోని జవహార్ రెడ్డి ముఠా సీఎం జగన్ విదేశాలకు వెళ్లగానే విశాఖలో దిగిపోయారని మూర్తి యాదవ్ ఆరోపించారు.

కౌంటింగ్కు ముందే పని చక్కదిద్దేందుకే విశాఖ, విజయనగరం అధికారులపై ఒత్తిడి తెచ్చారని, వైసీపీ ప్రభుత్వం విజయం సాధించలేదనే భయంతోనే రిజిస్ట్రేషన్లు చేయిం చేస్తున్నారని ఆరోపించారు. భోగాపురం విమానాశ్రయం చుట్టూ ఉన్న భూములపైనా కన్నేశారని, వైసీపీ నేతలకు చెందిన ముఠా ఒకటి ఇక్కడ తిరుగుతోందన్నారు. గత మార్చి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వేల కోట్ల అసైన్డ్ భూములు కొట్టేసిన వారిపై ప్రత్యేకంగా దర్యాప్తు చేయించాలన్నారు.

# తాళం వేసిన ఇళ్ళకి సీసీ కెమెరాలు అమరచండి

## క్రైమ్ డీసీపి వెంకటరత్నం

**ఆరిలోవ, మే 25, మేజర్‌న్యూస్:** ఆరిలోవ పరిసర ప్రాంతాల్లో ప్రతి ఇంటికి సీసీ కెమెరాలను అమర్చుకోవాలని, క్రైమ్ డీసీపీ పి. వెంకటరత్నం అన్నారు. శనివారం ఆరిలోవ పోలీస్ స్టేషన్ ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రోజురోజుకు జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. బంధువులు ఇంటికి యాత్ర లకు వెళ్లేవాళ్లు పోలీసులను సంప్రదిస్తే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారని , అవి కంట్రోల్ రూమ్ కు సంబంధించి ఉండడంతో ఎవరు ఇంట్లోకి ప్రవేశించాలన్న కంట్రోల్ రూమ్ లో బజార్ సౌండ్ వస్తుందని దాని ద్వారా స్థానికంగా ఉన్న పోలీస్ స్టేషన్ కు ఇన్ఫర్మేషన్ ఇచ్చి ఆ ఇంటి వద్దకు పంపిస్తామని అన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఉపయోగించుకోవాలని కోరారు. అవసరమైన వారు 949333 6633 నంబర్




కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో క్రైమ్ ఏసిపి వెంకట్రావు, ఆరిలోవ శాంతి సీఐ జి గోవిందరావు, క్రైమ్ ఎస్ ఐ మురళి పాల్గొన్నారు.

# ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు

(మొదటి పేజీ తరువాయి)

వరుసకు ఏడు చొప్పున మొత్తం 14 టేబుళ్లు ఉంటాయన్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభమవుతుందని, అరగంట తరువాత ఈవిఎం ఓట్ల లెక్కింపు మొదలుపెట్టాలని ఆదేశించారు. మొదట విడతలో మొత్తం పోస్టల్ బ్యాలెట్ల చెల్లుబాటును పరిశీలించాలని, అది పూర్తయ్యాక రెండో విడతలో పోస్టల్ బ్యాలెట్ పత్రాలను పరిశీలించి, పార్టీల వారీగా వేరుచేసి, అనంతరం ఓట్లను లెక్కించాలని తెలిపారు. ఒక్కో రౌండ్‌కు ఒక టేబుల్‌కు 500 ఓట్లను కట్టకట్టి ఇవ్వడం జరుగుందన్నారు. అన్ని టేబుళ్లలో మొదటి రౌండ్ పూర్తి అయిన తరువాతే రెండో రౌండ్ ఓట్లను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇదే సమయంలో సర్వీసు ఓటర్లకు సంబంధించిన ఇటిపిబిఎంఎస్ ఓట్ల లెక్కింపు కూడా నిర్వహించాలన్నారు. మొదటి ర్యాండమైజేషన్ ద్వారా ముందుగా కౌంటింగ్ సిబ్బందికి నియోజకవర్గాల కేటాయింపు జరుగుతుందని, రెండో ర్యాండమైజేషన్ ద్వారా టేబుళ్లను కేటాయించడం జరుగుతుందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్టు, ఈవిఎం ఓట్ల లెక్కింపు, రెండింటిపైనా లెక్కింపు సిబ్బంది పూర్తిగా అవగాహన ఏర్పరుచుకోవాలని, ఎవరిని ఏ ఓట్ల లెక్కింపునకు కేటాయిస్తారో ముందుగా తెలియదని చెప్పారు.

కౌంటింగ్ కేంద్రం లోపల ఆర్ఓ వద్ద అభ్యర్థి లేదా జనరల్ ఏజెంట్‌కు మాత్రమే కూర్చొనే అవకాశం ఉంటుందని, ఇతర ఏజెంట్లు, ప్రజాప్రతినిధులకు ప్రవేశం లేదని స్పష్టం చేశారు. అన్ని లెక్కింపు కేంద్రాల్లో సిసి కెమేరాలు ఉంటాయని, వీడియో రికార్డింగ్ కూడా జరుగుతుందని తెలిపారు. ఓటర్లు తాము ఎవరికి ఓటు వేశారన్న రహస్యానికి ఎట్టిపరిస్థితిలోనూ భంగం వాటిల్లకూడదని, దీనికి తగ్గట్టుగానే వీడియో రికార్డింగ్, సిసి కెమేరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు వేగంగా, సజావుగా, సమర్ధవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిఆర్ఓ ఎస్‌డి అనిత, ట్రైనింగ్స్ నోడల్ ఆఫీసర్ సుధాకరరావు, ఎలక్షన్ సెల్ సూపరింటిండెంట్ ప్రభాకరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మెలియాపుట్టి గిరిజన కుటుంబాన్ని ఆదుకోవాలి



**మెలియాపుట్టి, మే 25, మేజర్‌న్యూస్:** ఇటీవల పాతపట్నం మండలంలో ద్వారకాపురం గ్రామంలో ఆర్టీసీ బస్సు కింద పడి మెలియాపుట్టి మండలం తూముకొండ రామచంద్రాపురం గ్రామానికి చెందిన తోట అప్పల నరసమ్మ మృతి చెందింది. శనివారం సీతంపేట ఐటిడిఏ పీఓ శుభం బన్సల్ ను జేఏసీ నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. నరసమ్మ మృతితో ముగ్గురు పిల్లలు అనాథలు అయ్యారని ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సంఘ నాయకులు పివో దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వము నుంచి అన్ని విధాలుగా ఆ కుటుంబాన్ని ఆదుకోవడం జరుగుతుందని పిఓ హామీ ఇచ్చారని జేఏసీ నాయకులు తెలిపారు.

# మావోయిస్టులు అమర్చిన డంపు స్వాధీనం



(మొదటి పేజీ తరువాయి)

సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. డంపులో లభించిన వస్తువుల్లో మందుపాత్రలు, పేలుడు పదార్ధాలు మరియు ప్రభుత్వానికి వ్యతిరేఖంగా మావోయిస్టు పార్టీ భావజాలంతో కూడిన విప్లవ సాహిత్యం ఉందనీ ,ఈ పేలుడు పదార్ధాలు మావోయిస్టులకు ఎలా లభించాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, పరిసర ప్రాంతాలలో ఆధారాల కొరకు కూంబింగ్ పార్టీ గాలింపు చర్యలు పడుతున్నారని, పోలీసు వారు స్వాధీన పరచుకున్న డంపులో స్టీల్ క్యారేజ్ మందుపాత్రలు ఆరు, డైరెక్షన్లో మైన్స్ రెండు, పేలుడు పదార్ధం (కెల్ కంపెనీ ఒకటి ,150 మీటర్ల పొడవు కల ఎలక్ట్రికల్ వైర్లు,మేకులు మరియు ఇనుప నట్లు 5 కేజీలు,మావోయిస్ట్ సాహిత్య పత్రాలు. తదితర వస్తువులు లభించాయని వెల్లడించారు. అనంతరం చింతపల్లి అడిషినల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రతాప్ శివకిషోర్, ఐ.పి.ఎస్ మాట్లాడుతూ... అల్లూరి జిల్లా పరిధిలో మావోయిస్టు పార్టీ దాచిన డంప్ లన్నింటినీ అతి త్వరలో రికవరీ చేస్తామని, దీని విషయమై గిరిజన ప్రాంత ప్రజలు ఎవ్వరు ఎటువంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని,

ప్రశాంత జీవనాన్ని గడపాలని, మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు కాలంచెల్లిందని, గిరిజన ప్రాంత ప్రజలు అందరూ కూడా మావోయిస్టు పార్టీకి దూరంగా ఉండి, వారి యొక్క కుట్రపూరిత ప్రణాళికలపై జాగ్రత్తగా ఉండాలని, వారి కల్ల బొల్లి మాటలు నమ్మవద్దని, యువతీ యువకులు అందరు అల్లూరి గిరిజన ప్రాంత అభివృద్ధికి పాటు పడాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో సీలేరు ఎస్ఐ రామకృష్ణ,జి కె విధి, చింతపల్లిఆర్ ఎస్ ఐ జాన్ రోహిత్, జి. మాడుగుల ఎస్ ఐ శ్రీనివాసరావు లతో పాటు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్ధుల్లో టెన్షన్.. టెన్షన్..!

(మొదటి పేజీ తరువాయి)

పోటే ఉండే ఛాన్స్ ఉంది. కూటమి అభ్యర్థులు ఈ సారి గట్టిగానే మంత్రి పదవులు కోరే ఛాన్స్ ఉందని ఆ పార్టీలోనే చర్చ జరుగుతోంది. అలాగైతే టీడీపీ నుంచి కూడా రెండు మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వారికి కూడా ఈ దఫా సారీ చెప్పేయొచ్చు అనే అనుమానం కలుగుతోంది. పెద్దాయన చంద్రబాబు దృష్టిలో పడేందుకు టీడీపీ నేతలు ఈ సారి గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు.

# సర్వీస్ పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌కి తరలింపు



**అనకాపల్లి ప్రతినిధి, మే 25, మేజర్‌న్యూస్:** ఈటిపిబిఎస్ (ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా సర్వీస్ వోటర్ల) నుండి వచ్చిన పోస్టల్ బ్యాలెట్ ను తీసుకొని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూములో శనివారం భద్రపరిచారు. 25వ తేదీ వరకు 1262 సర్వీస్ ఓటర్ల పోస్టల్ బ్యాలెట్ అందుకోవడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు.

# ఏలేరు కాలువలో బాల శంకర్ మృత దేహం లభ్యం



**అనకాపల్లి, మే 25, మేజర్‌న్యూస్:** అనకాపల్లి జిల్లా కసింకోట మండలం వెదురుపర్తి గ్రామానికి చెందిన బాల శంకర్ మృతదేహం శనివారం తుమ్మపాల సమీపంలోని ఏలేరు కాలువలో లభించిందని అనకాపల్లి పట్టణ సిఐ శంకరరావు తెలిపారు. ఫైర్యాధిదారుడైన నాగ వీర వెంకట సత్యనారాయణ మూర్తి సత్యనారాయణమూర్తి, దేవినగర్, అనకాపల్లి ఫిర్యాదు మేరకు అనకాపల్లి టౌన్ పోలీసులు, ఫైర్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది కలిసి సెర్చ్ ఆపరేషన్ చేయగా ఏలూరు కాలవలో బాలాశంకర్ మృత దేహం లభ్యమైందని అన్నారు. అనకాపల్లి పట్టణ సిఐ శంకర రావు పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# జీవిత సత్యాన్ని నేర్పింది గణితం



**తెర్లాం, మే 25, మేజర్‌న్యూస్:** మనిషి జీవిత సత్యాన్ని నేర్పింది గణిత మే నని అందుకు ప్రతి విద్యార్థి గణితం పట్ల మక్కువ చూపాలని హై స్కూల్ ఉపాధ్యాయులు కె.వి స్సు సూచించారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా బాల్య దశలో నే చదువు పట్ల ఆసక్తి కలిగి విజ్ఞానం కోసం బడిలో చేరి అక్కడ నుంచి జీవితం ప్రారంభం అవుతుందన్నారు. అక్కడ నుంచి విద్య కోసం లెక్కలు ప్రారంభం కానున్న దని ఆయన అన్నారు. ప్రముఖ గణిత శాస్త్ర వేత్త రామానుజం ను ఆదర్శంగా తీసుకొని నిలవాలని ఆయన అన్నారు.అందుకు గణితం పైన దృష్టి సారించాలని సూచించారు.అలాగే గ్రంథాలయ అధికారి సి హెచ్ కృష్ణ మూర్తి పిల్లలకు రక రకాల పోటీలు పుస్తక పఠనం చేయించారు. కార్య క్రమంలో ఆయనతో పాటు విద్యార్థులు యువత పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక శక్తులను ఎదుర్కొన్నందుకే

# మాబ్ ఆపరేషన్ - మాక్ డ్రిల్

(మొదటి పేజీ తరువాయి)

ఓ వైపు ప్లకార్డులు చేతపట్టిన ఆందోళనకారులు, అల్లరి మూకలు(పోలీసులు) మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు ఆందోళనకారులను (వేషాల్లో ఉన్న పోలీసులు) మొదటగా హెచ్చరిక ఇచ్చుట, అది వినకపోతే పై అధికారుల అనుమతితో భాష్ప వాయువు ప్రయోగించుట ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ వారిపై ప్రయోగించుట,లాఠీ చార్జ్ చేపట్టుట,ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయుట. అప్పటికి పరిస్థితి అదుపులోకి రాక పోతే ఆందోళనకారులు చెదరగొట్టేందుకు ఫైరింగ్ చేయుట వంటివి మాబ్ అత్యంత నైపుణ్యంతో ప్రదర్శించారు.డ్రిల్ ద్వారా ద్వారా ఓట్లు కౌంటింగ్ సమీపిస్తున్న వేళ అల్లర్లు ఆందోళనలు విధ్వంసాలకు పాల్పడితే పోలీసులు తీసుకున్న చర్యలపై మాబ్ డ్రిల్ ద్వారా జిల్లా పోలిసులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల అనంతరం తుది ఫలితాలు వచ్చేవరకు జిల్లాలు ఎటువంటి అల్లర్లు, హింసాత్మక ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా ఈరోజు జిల్లా పోలీస్ యంత్రాంగం శ్రీకాకుళం పట్టణంలో డే అండ్ నైట్ కూడలి వద్ద మాబ్ ఆపరేషన్ - మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ మాబ్ ఆపరేషన్ యొక్క ముఖ్య ఉద్దేశం పోలీసులు యొక్క సన్నద్ధత మరియు ప్రజల్లో అవగాహన,చైతన్యం చేసేందుకు. జిల్లాలో 144 సెక్షన్, 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉన్నందున అసాంఘిక కార్యకలాపాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తుల మూకలను నియంత్రించి, ఒకే చోట నలుగురు కన్న ఎక్కువ మంది గుమ్మి గుడి ఆందోళనలు, హింసాత్మక ఘటనలు,చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై లాఠీచార్జ్, ఫైరింగ్ చేయడానికి వెనకాడబోమని ఎస్పీ హెచ్చరించారు. పై విషయాన్ని గుర్తించి ప్రజలు ఎవరు ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలులో పాల్గొనవద్దని ఎస్పీ కోరారు.ఓట్లు కౌంటింగ్ రోజు ఎవరైనా అల్లర్లకు ఘర్షణలకు హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నట్లు సమాచారం మేరకు ముందస్తు అరెస్టు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు ఇప్పటికే జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పెట్రోల్ బంకుల్లో లూజు పెట్రోల్ విక్రయాలు నియంత్రించామని , అదేవిధంగా పేలుడు పదార్ధాలు, బాణ సంచా విక్రయాలకు అనుమతి లేవున్నారు. ఓట్లు కౌంటింగ్ తుది ఫలితాలు అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహణకు అనుమతులు లేవని జిల్లాలో శాంతియుతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేందుకు ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు జిల్లా పోలీసులు

# విధుల్లో నిర్లక్ష్యం

## ఇద్దరు విమ్స్ స్టాఫ్ నర్సులకు నోటీసులు

**విశాఖపట్నం, మే 25, మేజర్‌న్యూస్:** విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు విమ్స్ ఆస్పత్రి స్టాఫ్ నర్సులకు డైరెక్టర్ కె.రాంబాబు శనివారం నోటీసులు జారీ చేశారు. మరోసారి తప్పు చేస్తే విధుల నుంచి తొలగిస్తామని కూడా ఆ నోటీసుల్లో ఆయన హెచ్చరించారు. రోగికి సరైన, నాణ్యమైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించినందుకు సదరు నర్సులపై చర్యలు చేపట్టారు. గౌతమి అనే స్టాఫ్ నర్స్‌తో పాటు మరో స్టాఫ్ నర్స్ రాత్రి వేళల్లో రోగులుండే వార్డును వదిలి ప్రత్యేక గదిలోకి వెళ్లి నిద్రించడంతో పాటు రోగులకు ఎఫ్ఎంవోతో వైద్యం చేయించారనే ఆరోపణలొచ్చాయి. సీసీ కెమెరాల ద్వారా ఈ విషయాన్ని గుర్తించిన డైరెక్టర్ రాంబాబు నర్సులకు ఫైనల్ వార్నింగ్ పేరట నోటీసులు జారీ చేశారు. పేదలకు విశేష సేవలందిస్తున్న విశాఖ ఇన్సిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో కొంతమంది స్టాఫ్ నర్సుల నిర్లక్ష్యం కారణంగా రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ ఫిర్యాదుల మేరకు ఇప్పటికే డైరెక్టర్ కె.రాంబాబు ప్రత్యేక దృష్టి సారించారు. నిరంతరం ఉద్యోగుల పని తీరును పరిశీలిస్తూ నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు చేపడతూ వస్తున్నారు. పేదలకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

# స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





(మొదటి పేజీ తరువాయి)

పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో జూన్ 04వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు వహిస్తూ ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, ఇతర అధికారులు సిబ్బంది వారి వెంట ఉన్నారు.

# జోన్-3, 5లో పలు ప్రాంతాలకు నేడు నీటి సరఫరా యధాతధం

**విశాఖపట్నం, మే 25, మేజర్‌న్యూస్:** మహా విశాఖ నగర పాలక సంస్థ జోన్-3, 5 పరిధిలో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా అంతరాయం వలన శనివారం త్రాగునీరు సరఫరాకు అంతరాయం ఏర్పడిందని జివిఎంసి మంచి నీటి సరఫరా నిర్వహణ విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.వి.ఎన్.రవి పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. జివిఎంసి పరిధిలోని పద్మనాభపురం, పి.డబ్ల్యూ.డి. పంప్ హౌస్ కు పద్మనాభపురం సబ్ స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా నిలిచిపోయినందున జోన్-3, 5 పరిధిలోని పలు ప్రాంతాలకు 25వ తేదిన శనివారం త్రాగునీటి సరఫరాకు అంతరాయం కలిగినందుకు చింతిస్తూ, మే 26 ఆదివారం త్రాగునీటి సరఫరా యధాతథంగా సరఫరా చేయబడునని ఆయన తెలిపారు.

# సీటీ స్కాన్‌కు గ్రహణం

- ఎన్‌టీఆర్ ఆస్పత్రిలో రూ.1.80కోట్లు వృథా
- మూలకు చేరిన యంత్రం..పట్టించుకోని అధికార యంత్రాంగం
- అభివృద్ధి పనులపై కమిటీ సమావేశాలూ నిల్

**విశాఖపట్నం, మే 25, మేజర్‌న్యూస్:** రోగులకు సేవలందించాల్సిన ఆస్పత్రి వైద్యులు మిన్నకుండిపోవాల్సి వస్తోంది. సాక్ష్యాత్తూ మంత్రి ప్రకటనా కాగితాలకే పరిమితమైపోయింది. దాతలిచ్చే నిధులు, సమకూర్చే యంత్రాలూ మూలకు చేరిపోయాయి. మొత్తంగా అనకాపల్లి జిల్లా రోగులకు ప్రధాన ఆస్పత్రి అయిన ఎన్టీఆర్ వైద్యాలయంలో ఇక్కట్లు తప్పడం లేదు. చాన్నాళ్లగా యంత్రం ఉన్నా ఇక్కడ సీటీ స్కాన్ పరీక్షల్ని నిర్వహించకపోవడంతో రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పేదలంతా ప్రైవేట్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఎన్టీఆర్ వైద్యాలయానికి ఆర్నెళ్ల క్రితం అదానీ గ్రూపు సంస్థ సీఎస్సార్ నిధులు వెచ్చించి రూ. 1. 80కోట్లతో ఇక్కడ సీటీ స్కాన్ యంత్రాన్ని కొనుగోలు చేసి ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ యంత్రాన్ని ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి, జిల్లా కలెక్టర్ రవిపటాన్ శెట్టి, సంబంధిత అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. సీటీ స్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించిన అనంతరం మంత్రి అమర్‌నాథ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ 10రోజుల్లో యంత్రాన్ని రోగులకు అందుబాటులోకి వస్తుందన్నారు. దీంతో పేదలంతా సంతోషం వ్యక్తం చేశారు. అయితే ఇప్పటి వరకు ఆ యంత్రం అందుబాట్లోకి రాకపోవడంతో జనం నరకం చూస్తున్నారు. విచిత్రమ ఏంటంటే యంత్రం ఉన్న గదిని కూడా ఇప్పటి వరకూ తెరవలేదు. సీటీ స్కాన్ యంత్రం ఎప్పుడు పనిచేస్తుందా, తమ ఇబ్బందులు ఎప్పుడు తీరుతాయా అని రోగులు ఎదురు చూస్తున్నారు. యంత్రం ఉన్నా తామంతా ప్రైవేట్ ల్యాబ్‌ల్నే ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి యంత్రమైతే ఉంది కానీ దానిని నిర్వహించే ఆపరేటర్ లేకపోవడంతోనే




సీటీ స్కాన్‌ను అలా ఉంచేశారని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఈ ఏడాది జనవరిలో ఆస్పత్రిని సందర్శించిన వైద్య విధాన పరిషత్ కమిషనర్ దృష్టికి ఈ సమస్యను తీసుకు వెళ్లగా త్వరలోనే దీనిని వినియోగంలోకి తీసుకువస్తామని ఆయనా చెప్పారు. అదీ కార్యరూపం దాల్చలేదు. భారీ ఎత్తున సొమ్ము ఖర్చు చేసి సీటీ స్కాన్ ఏర్పాటు చేసినా, దానిని వినియోగంలోకి తీసుకు వచ్చే విషయంలో మాత్రం అధికారులు స్పందించకపోవడం దారుణం.

**సమావేశాలెక్కడ?**

ఆస్పత్రి అభివృద్ధి కోసం నెలవారీ ఏర్పాటు చేయాల్సిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు కూడా ఇక్కడ తరచూ నిర్వహించడం లేదు. కమిటీ కూర్చుంటే సమస్యల్ని ప్రస్తావించొచ్చు. అయినా కలెక్టర్, పాలక మండలికి ఖాళీ లేదంటున్నారు. ఇటీవల ఈసీ కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు దాని పేరు చెప్పి తప్పించుకుంటున్నారు. అయితే రోగులు చావుబతుకుల్లో ఉన్నా అత్యవసర పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన సమయంలోనూ కోడ్ పేరు చెప్పి తప్పించుకోవడం బాధాకరమని రోగుల సహాయకులు గగ్గోలు పెడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా రోగులొచ్చే ఆస్పత్రి పరిస్థితే ఇలా ఉంటే చిన్నాస్పత్రుల పరిస్థితి ఇంకేమైపోవాలని, సరైన సౌకర్యాలు లేకనే చిన్న చిన్న సమస్యలకు కూడా వైద్యులు కేజీహెచ్‌తో పాటు ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాలు సమకూర్చేందుకు చూపించేంత ఆసక్తి వాటిని నిర్వహించడంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు.

## ఉమ్మడి అభ్యర్థి జగదీశ్వరి గెలుపు తధ్యం

### మండల టీడీపీ కన్వీనర్ అక్కేన మదు



గరుగుబిల్లి, మే 25, మేజర్‌న్యూస్: తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి గెలుపు తధ్యమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అక్కేన మధు సూదనరావు అన్నారు. మండల పరిధిలోని నాగూరు గ్రామంలో శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో చంద్రబాబునా యుడు ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని రానున్నది ప్రజాప్రభుత్వం అని పేర్కొన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. ఈప్రభుత్వాన్ని ప్రజలు సాగనం పారని వచ్చేనెల నాలుగవ తేదీన జరిగిన ఎన్నికల కౌంటింగ్ ఫలితాలపై అందరూ ఆసక్తిగా చూస్తున్నారని ఈఫలితాలలో ఉమ్మడి అభ్యర్థులు ప్రభంజనం సృష్టిస్తారని తెలిపారు. ఎన్నికల్లో కష్టపడిన తెలుగు దేశం ,జనసేన, బిజెపి, నాయకుల కు , కార్యకర్తల%శీ%దరికి ధన్యవాదాలు తెలుపుతూ భవిష్యత్తులో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు మాజీమంత్రి వర్యులు శత్రుచర్ల విజయ రామరాజు , మనకాబోయే ఎమ్మెల్యే జగదీశ్వరి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్ సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తామని ఈసందర్భంగా మధుసూదనరావు వెల్లడించారు.

# గెలుపు బాటలో కోండ్రు



రేగిడి, మే 25, మేజర్‌న్యూస్: ఈ నెల 13 న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ విజయం సాధిస్తారని పలువురు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గతంలో కోండ్రు మంత్రి గా ఉన్నప్పుడు నియోజక వర్గానికి చేసిన అభివృద్ధి తో పాటు ఆయనపై ఉన్న నమ్మకం, కూటమి ప్రవేశపె డతామన్న సూ పర్ సిక్స్ పథకాలు ఆయన గెలుపు కు తోడ్పుతున్నట్లు విశ్లేషిస్తున్నారు. వైసిపి పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి, చంద్రబాబు పై ఉన్న నమ్మకం కూటమి అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ గెలుపు కు బాగా కలిసి వచ్చిన అంశాలు గా భావిస్తున్నారు.ఏదేమైనా కూటమి అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ 13వేల పై చిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సాధించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## బాడంగి గురుకులంలో ప్రవేశాలకు కౌన్సిలింగ్

బాడంగి, మే 25, మేజర్‌న్యూస్: స్థానికడాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం లో ఈ నెల 28వ తేదీన బాలురకు 5 వ తరగతి లో ప్రవేశం కొరకు కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రిన్సిపాల్‌టి రామదాసు తెలిపారు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 30 వ తేదీన బాలురకు ఇంటర్మీడియేట్ ప్రవేశాలు కి కౌన్సెలింగ్ బాడంగి గురుకుల పాఠశాలలో జరుగుతుందని కావున విద్యార్థుల తల్లితండ్రులు, స్టూడెంట్స్ అందరూ కూడా దీనిని గమనించగలరని అవసరమైన విద్యార్థులు ఆధార్ కార్డు తో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లతోఆయా తేదీల్లో కౌన్సెలింగ్ కు హాజరు అవ్వాలని ఆయన కోరారు.

# డీఈఓ ఆకస్మిక తనిఖీ



పూసపాటిరేగ, మే 25, మేజర్‌న్యూస్: పూసపాటిరేగ చెప్పి ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. స్థానిక జడ్పీ పాఠశాలలో పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు జరుగుతుండగా పరీక్ష కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను పరిశీలించారు. పాఠశాల పున ప్రారంభం సమయానికి గ్రామాల్లో ఉన్న పాఠశాలకు చేర్చే విధంగా మండల విద్యాశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఇటువంటి అలసత్వం నిర్వహించకూడదని మండల విద్యాశాఖ అధికారి సిబ్బందికి జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ దిశా నిర్దేశం చేశారు.

## మాస్టర్‌లో తేడా ఉంటే కఠిన చర్యలు ఉపాధి ఏపీవో త్రినాధరావు



రామభద్రపురం, మే 25, మేజర్‌న్యూస్: మండల పరిధిలో తారాపురం లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను శనివారం ఉదయం ఆయన పరిశీలించారు వెళ్ళగానే ముందు మస్టను వెరిఫికేషన్ చేసి మస్టర్లు సమానంగా ఉండడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు అనంతరం వేతనదారులతో సమావేశమై అయిరి ప్రతిరోజు ఉదయం 6 గంటల 10:30 వరకు మధ్యాహ్నం నాలుగు గంటల నుండి 5:30 వరకు పనులు చేసి 300 వేతనం వచ్చేటట్లు పనులు చేయాలని నేను సూచించారు ఎండలు తీవ్రంగా ఉండడంతో మంచినీరు సౌకర్యం టెంట్లు వేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ సూచించారు ఎస్సీ ఎస్టీ వికలాంగులకు వందశాతం పని కల్పించాలని ఫీల్డ్ తిరుపతికి సూచించారు.

# నో ఫ్లై జోన్‌గా ఎన్నికల లెక్కింపు కేంద్రం

పార్వతీపురం, మే 25, మేజర్‌న్యూస్: ఉల్లిభద్ర లో గల ఉద్యాన కళాశాల పరిసరాలను "నో ఫ్లై జోన్" గా ప్రకటించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. మానవ రహిత వైమానిక వాహనాలు, డ్రోన్‌లు, బెలూన్‌లు మొదలైన వాటితో సహా ఎలాంటి విమానయాన పరికరాలను ఎగురవేయడం నిషేధించడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అరకు (ఎస్టీ) పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో సహా పాలకొండ, కురుపాం, పార్వతీపురం, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జూన్ నెల 4వ తేదీన కళాశాలలో ఏర్పాటు చేసిన సంబంధిత కౌంటింగ్ హాళ్లలో జరుగుతుందని చెప్పారు. 4 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద 3 అంచెల భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిం దని, ముందుజాగ్రత్త చర్యగా, భద్రతా ఏర్పాట్లలో భాగంగా స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల భద్రత దృష్ట్యా ఉల్లిభద్ర లో గల ఉద్యాన కళాశాల పరిసరాలను తదుపరి ఆదేశాలు వరకు "నో ఫ్లై జోన్" గా ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టరు తెలిపారు.

# పెద్ద పేట గ్రామంలో మెగా రక్తదాన శిబిరం



పాలకొండ, మే 25, మేజర్‌న్యూస్: బూర్జ మండలం పెద్ద పేట గ్రామంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 వసంత పూర్తి చేసిన సందర్భంగా ఏర్పటుచేసిన చేసిన ఆర్ట్ స్వచ్ఛంద సేవ సంస్థ, రెడ్ క్రాస్ సంస్థ సంయుక్తంగా ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 102 మంది రక్తదానం చేశారు. ఈ క్యాంపులో పాల్గొన్న పాలకొండకు చెందిన ముంజి మురళీకృష్ణ 40వ సారి రక్తదానం చేశారు. అలాగే బూర్జ గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్ శాహిన్న ఎనిమిదో సారి రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, ఎన్ అనూప్ కోర్డినేటర్ ఆర్ట్ శ్రీకాకుళం రెడ్ క్రాస్ చైర్ పర్సన్ జగన్మోహన్రావు హాజరయ్యారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో రక్త నిల్వలు తక్కువగా ఉంటున్న నేపథ్యంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం చాలక చాలామంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్తదానం చేసిన వారికి రెడ్‌క్రాస్ సోసైటీ సర్టిఫికెట్లు అందజేశారు రక్తదానం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని అన్నారు.రక్తదానానికి మించిన సేవా కార్యక్రమం మరొకటి లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డిడియం రమేష్ కుమార్, వరప్రసాద్, శ్రీకాకుళం రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహన్రావు, మన్యం జిల్లా రెడ్ క్రాస్ ప్రతినిధి శ్రీరాములు,, వెంకీ చైతన్య కుమార్, మాజీ సీఈవో మోహన్ రావు, మాజీ జెడ్పిటిసి రామకృష్ణ నాయుడు, టిట్కో డైరెక్టర్ గోవిందరావు, బి శంకరరావు సీఈఓ మన్యం సహజ .ఎం రవి సీఈఓ.మాతోట వన సహజ.సందీప్ . ప్రసన్న. పద్మ .పాల్గొన్నారు.

# వెబ్‌సైట్‌లో ఎస్టీ కొండ దొర తెగలను తొలగించడం దారుణం

**- తక్షణమే ప్రభుత్వ వెబ్ సైట్‌లో పున్నరుద్దరించాలి**

**- రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజషన్ సెక్రటరీ సాగర సుబ్బారావు**

పాడేరు, మే 25, మేజర్‌న్యూస్: వైసీపీ ప్రభుత్వం ఆదివాసీ తెగలను రోజు రోజుకు ఒక్కొకటి ప్రభుత్వ వెబ్ సైట్ నుండి తొలగింపు విధానానికి శ్రీకారం చుట్టింది.ఇందులో భాగంగానే ఇప్పుడు కొండ దొర తెగను ప్రభుత్వ వెబ్ సైట్ లో తొలగించడం జరిగిందనీ తెదేపా పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజషన్ సెక్రటరీ సాగర. సుబ్బారావుఆవేదన వ్యక్తం చేశారు.ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... గిరిజన తెగలైన కొండ దొర తెగలను గత తొంబై రోజులుగా ప్రభుత్వ వెబ్ సైట్ లో తొలగించడం చాలా దారుణమని, గతంలో కూడ వాల్మీకి, భగత తెగలను తొలగించడం వల్ల చదువుకునే పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రం లేక అనేక మంది ఇబ్బందులు పడిన దుస్థితి ఏర్పడిందనిఈ సంధర్భంగా గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం తక్షణమే స్పందించి వెబ్ సైట్ లో పెట్టాలని దీని ద్వారా షెడ్యూల్ తెగలకు రావాల్సిన ప్రభుత్వ పథకాలు కొండ దొర తెగాలకు రాకుండా నష్ట పోతున్నారని, వెంటనే ప్రభుత్వ వెబ్ సైట్ లో పున్నరుద్దరణ చేసి ప్రభుత్వ పథకాలు పొందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇటువంటి పాశవిక



చర్యలకు పాల్పడితే బుద్ధి చెప్పాదని సమయం ఆసన్నమైందనీ, ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి, బాకూరు సర్పంచ్ బాకూరు సర్పంచ్ బాకురు వెంకటరమణ రాజు,రాష్ట్ర ఎస్టి సెల్ ఆర్గనైజషన్ సెక్రటరీ సాగర సుబ్బారావు,దారేలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, అండీభ సర్పంచ్ తామర్ల సత్యనారాయణ,క్లస్టర్ ఇంచార్జి రూడి త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ హాల్స్‌లో ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



పాడేరు, మే 25, మేజర్‌న్యూస్: కౌంటింగ్ హాల్స్ లో చేపట్టిన ఏర్పాట్లను శనివారం పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. విజయ సునీత కౌంటింగ్ సిబ్బంది, ఏజంట్లకు వేర్వేరుగా ఎంట్రీలు ఉండాలని, వారు లోనికి ప్రవేశించే మార్గాలు కూడా వేరుగా ఉండాలని ఎట్టి పరిస్థితుల్లోనూ ఏజంట్లు కౌంటింగ్ టేబుల్స్ వద్దకు వెళ్లకుండా వారికి కేటాయించిన స్థలంలోనే ఉండి కౌంటింగ్ పర్యవేక్షించే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూముల ప్రతి రోజు తనిఖీలో భాగంగా

**- కౌంటింగ్ సిబ్బంది, ఏజంట్లకు వేర్వేరు ఎంట్రీలు**

**- జిల్లా కలెక్టర్ విజయ సునీత**

శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ హాల్స్ ను పరిశీలించారు. పోలింగ్ ఏజంట్లకు ఏర్పాటు చేస్తున్న ఐరన్ మెస్ పనులు పూర్తి చేసి, సిసి కేమారాలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకు రావాలని, ప్రతి హాలులో 14 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రతి ప్రదేశంలోను అవసరమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు అవకాశం లేని విధంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న భవనంలో మీడియా కేంద్రం ఏర్పాటు చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో అరకు వ్యాలీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, రంపచోడవరం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్ కుమార్, డిఆర్‌ఓ బి. పద్మావతి, గిరిజన సంక్షేమ ఇఇ డివిఆర్ ఎం రాజు, డిఇఇ అనుదీప్, పలువురు తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# నక్సల్బరి పందా దేశ విముక్తికి సరైన మార్గం

పలాస/మందస, మే 25, మేజర్‌న్యూస్: భారత విముక్తికి నక్సల్బరి పందా సరైన మార్గం అని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ వంకల మాధవరావు పేర్కొన్నారు. 57 ఏళ్ల నిండుతున్న నక్సల్బరికి విప్లవ జేజేలు పలుకుతూ నక్సల్బరి ఉద్యమ వారసత్వాన్ని ఎత్తుపడుతూ వెలుగెత్తి చాటాలని ఆయన పిలుపునిచ్చారు. పలాస మండలం తర్లాకోట పంచాయతీ కొట్టారింగి గ్రామంలో నక్సల్బరికి జేజేలు అంటూ నినాదాలు ఇస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో మాధవరావు మాట్లాడుతూ భారత దేశంలో దున్నేవానికి భూమి నినాదంతో వ్యవసాయక విప్లవాన్ని విజయవంతం చేయాలంటే నక్సల్బరి మార్గం, సాయుధ పోరాట మార్గమే సరైన మార్గం. పార్లమెంటరీ పందా,రివిజినిస్ట్, పందాని తిరస్కరించి దేశంలో ఒక నిశ్శబ్దత వాతావరణ నెలకొన్నప్పుడు నక్సల్బరిలో సంతాల్ ఆదివాసీలు భూమి కోసం చేసిన సాయుధ పోరాటం తిరుగుబాటు ఆనాడు దేశంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులను, యువకులను, మేధావులను ఆలోచింపజేసింది. ఆనాడు శ్రీకాకుళం ప్రాంతంలో దాని కొనసాగింపుగా శ్రీకాకుళం అడవుల్లో ఆనాడు మంటలు మండాయి. శ్రీకాకుళం ఉద్యమం విశాలమైనది. విస్తృతమైనది. వేలాది ఎకరాల భూములు సాధించి ఫారెస్ట్ అధికారుల భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అణిచివేతలకు వ్యతిరేకంగా పేదల పక్షాన పోరాడుతూ శ్రీకాకుళ ఉద్యమాలు జరిగాయి. ఈ పార్లమెంటరీ వ్యవస్థ డొల్లతనం బయటపెట్టాయి. గ్రామీణ ప్రాంతాలలో అర్ధవలస అర్ధ భూస్వామ్య దేశంలో గ్రామాలను చుట్టుముట్టి




అంతిమంగా విముక్తి ప్రాంతాలను ప్రకటించుకొని ప్రతిఘటన స్థావరాలు నిర్మించాల్సిందే. నక్సల్బరి ఉద్యమాలు అనేక అనుభవాల అందించాయని మాధవరావు పేర్కొన్నారు. ఐఎఫ్టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి మాట్లాడుతూ నక్సల్బరి ఒక ఊరు పేరు మాత్రమే కాదు భారత విప్లవోద్యమానికి చిరునామా అన్నారు. నక్సల్బరి ఒకే ఒక్క మార్గం. ఆనాడు భారతదేశం నలుమూలల ఏకీ రాస్తా ఏకీ రాస్తా నక్సల్బరి శ్రీకాకుళం ఏకీ రాస్తా అంటూ విశ్వవిద్యాలయాల ముందు నినాదాల మారుమోగాయి అని తెలిపారు. పలాస మండలం కొటారింగులో జరిగిన ఈ సభలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్స్ సవర బంగ్లా కుమార్, మాట్లాడారు. పాపారావు, సవర సోమేశ్వరరావు, ఆనంద్, గోవింద్, కుమారి, దేవేందర్, భువన్ కుమార్, విశాల్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# వేళకు లే (రా)ని బస్సులతోవంగర మండల మహిళలు పాట్లు



వంగర, మే 25, మేజర్‌న్యూస్: వేళకు బస్సులు ను వంగర మండలం నకు తిప్పక పోవటంతో వంగర మండల ప్రయాణీకులు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు వర్ణాతీ తంగా ఉన్నాయి. ఆటోలు మీదను అతి ప్రమాద పరిస్థితుల్లో ప్రయాణాల కొనసాగించక తప్పటం లేదిని మహిళలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాలకొండ ఆర్ టీసీ డిపో అదికారులు వంగర మండలాన్ని పూర్తిగా పట్టించుకోవటం లేదన్న ఆరోపణలున్నాయి.బస్సులు వంగర మండలంలో వివిద స్టే జీలుకు సకాలంలో చేరింది, చేరంది పట్టించుకొనే నాథుడే లేరన్నది సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పాల కొండ ఆర్టీసీ డిపో అధి కారులు వేళలు పాటించని బస్సులను తిప్పటం వల్ల ముఖ్యంగా మహిళా ప్రయాణీకులు, ప్రయాణీకులు, ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ పనులు మీదను వంగర మండలం నకు చెందిన ప్రయా ణీకుల కోసం తిప్పుతున్న అర్ టీసీ బస్సులు వల్ల ఎటువంటి ఉపయోగం లేదని చెప్పక తప్పదు. రాజాం నుంచి వంగర నడుస్తున్న బస్సులు అన్నియు రాజాం నుండి ఉదయం 7.30 గంటలతో సరి.ఆసమయం తరువాతను మరలా మద్యా హ్నం 3 గంటలు వరకూ వంగర మండలంలో మండల కేంద్రం నకు,మండలంలో ఉన్నటువంటి ఏ గ్రామాలు చేరాలంటే ప్రైవేట్ ఆటోలు తప్ప,వేరే గత్యంతరం లేదు. రాజాం లో ఆటోలు కోసం మహిళలు,ప్రభుత్వ ఉద్యోగులు, ప్రయాణీకులు ఎదురు చూస్తూ, ఆ ఆటో ఎప్పుడు అక్కడ తీస్తే తప్ప గమ్యానికి చేరుకో లేని పరిస్థితి. వంగర మండలం నుంచి వివిధ గ్రామాలకు వచ్చే వెల్లే బస్సులు ఉదయం 9.30 గంటల కు వచ్చే బస్సే లాస్ట్. రి సాయం కాలం 4 గంటలు తరువాతనుక బస్సులు రెండు, మూడు పర్యాయాలు వస్థాయి.ఆతదుపరి రాజాం నుండి రాత్రి 9.30 గంటలకు బయలు దేరిన బస్సుతో సరి. ఉదయం రాజాం నుండి బస్సులు ఉదయం 7.30 గంటలు రెండు మూడు,ట్రిప్పులు బస్సులు తిరుగు తాయి.ఆ తరువాతను మధ్యానం 4 గంటలు వరకూ రాజాం నుండి వంగర మండలం నకు సంబందిం చిన వంగర,కొప్పర రుషింగి, కింజంగి, భాగింపేట వరకూ తిరిగే బస్సులు కోసం ప్రయాణీ కుల కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూసి, విసిగి ఆటోలలో కిక్కిరిసిన ప్రయాణీకులు ఉంటే తప్ప,అంతవరకూ ఆటోను తీసిన పరిస్థితు లుండవు.

అదే బస్సులు సమయా నికి,గంట కొక ట్రిప్పు వంతున అర్ టీసీ అధికారులు తిప్పివుంటే,ప్రయాణీకులకు ఇలాంటి తిప్పలు ఉండవు. అదే మన్యం పార్వతీ పురం జిల్లా కేంద్రంలో ఉన్న అర్ టీసీ డిపో నుంచి మండల కేంద్రం వరకూ రెండు ట్రిప్పులు బస్సులు వేశారు. ప్రతీ గంట, గంటన్నర కో బస్సులు వస్తుండటంతో,అటువైపు వెల్లే ప్రయాణీకుల కు ఏటువంటి ఇబ్బందులు లేవని నేరుగా ప్రయాణీకు లే తెలిపారు. పాలకొండ అర్ టీసీ డిపోమేనేజర్ వంగర మండల ప్రయాణీకులకు ప్రతీ గంటకు కనీసం మండల కేంద్రం న కైనసూ ట్రిప్పులు బస్సును వేసి ప్రయాణీ కులు ఇబ్బందులు లేకుండా చూడాలని వంగర మండల ప్రజలు కోరుతున్నారు. లేనిచో ప్రయాణీకులుకు,మండల కేంద్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఇబ్బందులు తప్పవు.

## జిల్లా కలెక్టర్ కారు డ్రైవర్ మార్టిన్ మృతి

### సంతాపం తెలిపిన ఉన్నతాధికారులు సిబ్బంది



పార్వతీపురం, మే 25, మేజర్‌న్యూస్: పార్వతిపురం మన్యం జిల్లా కలెక్టర్ కారు డ్రైవర్ తాలాడ మార్టిన్ శుక్రవారం రాత్రి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మార్టిన్ గుండెపోటు రావటంతో గత కొద్ది రోజులుగా విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం సాయంత్రం పరిస్థితి విషమించడంతో ఆయన మరణించారు. మార్టిన్ సతీమణి శ్రీకాకుళం జిల్లా మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో మార్టిన్ మృతిని సంతాపంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక ఇతర ఉన్నతాధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలను అలంకరించి ఘనంగా అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మార్నింగ్ సేవలను అధికారులు సిబ్బంది కొనియాడారు. వారి కుటుంబానికి మానసిక ధైర్యాన్ని ఆ భగవంతుడు కల్పించాలని మార్టిన్ ఆత్మకు శాంతి కలగాలని వేడుకున్నారు.

## రాజా కళాశాల విద్యార్థినికి విజయనగరం జిల్లా ప్రథమ ర్యాంక్



బొబ్బిలి, మే 25, మేజర్‌న్యూస్: రాజా ఆర్ ఎస్ ఆర్ కె రంగారావు కళాశాల, బొబ్బిలి పట్టణానికి చెందిన పొట్నూరు హారిక కు ఆంధ్రా యూనివర్సిటీ స్థాయిలో విజయనగరం జిల్లాకు 9.7 గ్రేడ్ పాయింట్స్ తో ప్రథమ ర్యాంక్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ చల్లా వీరేంద్ర కుమార్ శనివారం తెలిపారు. ఈ విద్యార్థిని 2020 - 23 బ్యాచ్ లో బి ఎస్సీ మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగములో డిగ్రీ ను 9.7 గ్రేడ్ పాయింట్స్ తో పూర్తి చేసినట్లు తెలిపారు . ఈ మేరకు శుక్రవారం ఆంధ్రా యూనివర్సిటీ వారు ఈ విద్యార్థిని విజయనగరం జిల్లాలో ప్రథమ ర్యాంక్ సాధించినట్లు ప్రకటించడం చాలా సంతోషముగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ విద్యార్థిని మంచి స్కోర్ సాధించడానికి కారణమైన అధ్యాపకులకు మరియు ఈ విద్యార్థినికు, కళాశాల చైర్మన్ శ్రీ ఆర్ వి సుజయ్ కృష్ణ రంగారావు, కళాశాల ఎడవైజర్ సెక్రటరీ రావు బదరి అభినందనలు తెలిపారు.

## మెలియాపుట్టి 40 లీటర్ల నాటు సారా స్వాధీనం



మెలియాపుట్టి, మే 25, మేజర్‌న్యూస్: మెలియాపుట్టి మండలంలో సవర మురికింటి భద్ర గ్రామంలో శనివారం పాతపట్నం సీఐ సాయి, ఎస్ఐ. రాజేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది శనివారం కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాటు సారా స్థావరాలపై పాతపట్నం సీఐ సాయి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 40 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. పాతపట్నం ఎస్ఐ మహమ్మద్ యాసీన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## అనకాపల్లిలో స్టంట్ మెన్ బద్రి జన్మదిన వేడుకలు



అనకాపల్లి, మే 25, మేజర్‌న్యూస్: అనకాపల్లి పట్టణంలో స్టంట్ మెన్ బద్రి జన్మదిన సందర్భంగా అనకాపల్లి మెగా ఫాన్స్, బద్రి ఫ్యాన్స్ సంయుక్తంగా గొంతిన శివశంకర్ ఆధ్వర్యంలో అనకాపల్లి నియోజకవర్గంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా బద్రి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గాంధీ నగర్‌లో ఉన్న సత్య సాయిబాబా ఓల్డ్ ఏజ్ హోమ్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ స్టంట్ మెన్ బద్రి జన్మదిన సందర్భంగా అనకాపల్లి నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా బద్రి జన్మదిన సందర్భంగా అనకాపల్లి మెగా ఫాన్స్, బద్రి ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఓల్డ్ ఏజ్ హోమ్ లో అన్నదాన సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, కుమార్, బాల, కరణం సత్తిబాబు, బాదం సతీష్, కోయిలాడ గంగాధర్, అనంత్, అర్జున్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## 28న ఎర్ని దుర్గమాంబ అనుపు మహొత్సవం

### పూజలు చేసిన మేయర్ దంపతులు



విశాఖపట్నం, మే 25, మేజర్‌న్యూస్: తోటగరువులో వేంచేసి ఉన్న ఎర్నిమాంబ సన్నిధిలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు శనివారం పూజలు నిర్వహించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ విశాఖ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నామన్నారు. ఇదిలా ఉంటే ఈ నెల 25నుంచి 28వరకు ఇక్కడ పండగ జరగనుంది. శనివారం పండగతో పాటు ఆదివారం చాటింపు ఉంటుందని, సోమవారం తొలేళ్ళు, మంగళవారం అమ్మవారి అనుపు మహొత్సవం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా, భారీ ఊరేగింపు ఉంటుందన్నారు. మేయర్ దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు ఒమ్మి శ్రీనివాస్, మొల్లి అప్పలరాజు, మొల్లి జగ్గారావు తదితరులు సాదరంగా స్వాగతం పలికారు.

### తిమ్మరాజుపేట గ్రామంలో
# ఉపాధి పనులు ప్రారంభించాలి
### బకాయి వేతనాలు ఇవ్వాలని సచివాలయం వద్ద ధర్నా



**అచ్చుతాపురం, మే 25, మేజర్‌న్యూస్:** జాతీయ ఉపాధి హామీ పనులు ప్రారంభించి బకాయి వేతనాలు ఇవ్వాలని తిమ్మరాజుపేట సచివాలయం వద్ద ఉపాధి కూలీలతో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ .రాము తిమ్మరాజుపేట మాజీ సర్పంచ్ కర్రి .అప్పారావు మాట్లాడుతూ తిమ్మరాజుపేట గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభించక పోవడం వలన పేదలు, రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధి హామీ చట్టం ప్రకారం పని కల్పించకపోతే బృతి ఇవ్వాలని వెంటనే తిమ్మరాజుపేట గ్రామంలో పనులు ప్రారంభించి పెదపాడు, తిమ్మరాజుపేట గ్రామంలో గత సంవత్సరం చేసిన కూలి డబ్బులు బకాయిలు మూడు నుండి ఏడు వారాలు ఇవ్వాల్సి ఉందని వెంటనే బకాయి డబ్బులు కూడా మంజూరు చేయాలని కోరారు. తిమ్మరాజుపేట సచివాలయ కార్యదర్శి దీనబంధ్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు ఎస్ దేవుడు పి అప్పలనర్స జి లక్ష్మి పీ నూక రత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సాగర గణపతి ప్రధమ వార్షికోత్సవం



**భీమునిపట్నం, మే 25, మేజర్‌న్యూస్:** భీమిలి జోన్ ఎగువపేట గ్రామం మత్స్యకారుల ఇలవేల్పు శ్రీ పోలమాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ సాగర గణపతి ఆలయం ప్రధమ వార్షికోత్సవ వేడుకలు గ్రామాభివృద్ధి సేవాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శనివారం తెల్లవారుజాము నుండే శ్రీ సిద్ది వినాయకునికి గ్రామ పెద్దలు, గ్రామాభివృద్ధి సేవాసంఘం సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా 3 వేలమందికి అన్నధానం ఏర్పాటు చేసారు. ఊరు ప్రజలందరూ బాగుండాలని, స్వామివారి దీవెనలు అందరికీ కలగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేకంగా హెూమాలు నిర్వహించామని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలియజేశారు.

## క్రేం బ్రిడ్జి పరీక్షల్లో సత్తా చాటిన ఓక్రిడ్జ్ విద్యార్థులు




**భీమునిపట్నం, మే 25, మేజర్‌న్యూస్:** భీమిలి మండలం, సింగన బంధ పంచాయతి ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూలుకు చెందిన ఎస్. డి.రిషి , ఎస్. కె. ప్రవీణ్ వర్మ ఇటీవల విడుదలైన క్రేం బ్రిడ్జ్ ఐ జి సి ఎస్ ఈ – 2004 పరీక్షల్లో మొదటి రెండు స్థానాలు సాధించారు. వారు విద్యా విషయంలోనే కాకుండా వివిధ అంశాల్లో ప్రతిభ కనపరిచారని స్కూల్ ప్రిన్సిపాల్ భమిడిపాటి శైలజ, డైరెక్టర్ అమిత్ జైన్ తెలిపారు. గతంలో రిషి యూనిసెఫ్ జట్టులో ప్రతినిధిగా పాల్గొన్నడన్నారు. ప్రవీణ్ వర్మ నాలుగు ఐక్యరాజ్యసమితి మోడల్ సమావేశాల్లో బెస్ట్ డెలిగేటుగా పాల్గొన్నాడని తెలిపారు. వీరిద్దరూ జిల్లాస్థాయి బాల్ బాడ్మింటన్, ఫుట్బాల్ పోటీల్లో ఉన్నత విజయాలు సాధించారని తెలిపారు.

### పంట పొలాల్లో విద్యుత్తు
## తీగలతో పొంచి ఉన్న ప్రమాదం



**దేవరాపల్లి, మే 25, మేజర్‌న్యూస్:** మండలంలోని చిననందిపల్లి నుంచి చేనులపాలెం వెళ్లే మార్గంలో భీమవరపు కలాల వారి దగ్గర నుంచి గొర్రుపోటు వారి కలాలకు వెళ్లి పంట పొలాల లో సుమారుగా నాలుగు విద్యుత్తు స్తంభాలు నేలకి ఒరిగి ఉన్నాయి. అటుగా వెళ్లే రైతన్నలు ప్రమాదానికి గురి అయ్యే అవకాశం ఉందని ఇప్పటికే శాఖ అధికారులకు విన్నవించుకున్న కనీసం పట్టించుకోలేదంటూ ఆ అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్ కో ఏఈ శంకరరావు ను ప్రశ్నించగా ఈ సమస్య మా దృష్టికి వచ్చిందని మంగళవారం లోపు ఈ పనులు పూర్తి చేస్తామన్నారు.

### మహాత్మా గాంధీ విగ్రహం
## చుట్టూ పార్క్‌ను ఏర్పాటు చేయాలి



**గాజువాక, మే 25, మేజర్‌న్యూస్:** స్వాతంత్ర్య సమర యోధుడు జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం పాత గాజువాక జంక్షన్ కూడలిలో ఏర్పాటుచేసిన ప్రాంతం లో జీవీఎంసీ అధికారులు ఆధునికరణ పనులు చేయాలని అఖిల భారత మానవ హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సెల్ చైర్మన్ మరియు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాగరపు శ్రీను కోరారు. మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటు పై స్థలం కేటాయించాలని గత ఆరు సంవత్సరాలుగా ఎన్నో పోరాటాలు చేసి చివరకు పాత గాజువాక జంక్షన్లో గాంధీ విగ్రహాన్ని స్థాపించారు. మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటుకు తన సొంత ఖర్చులతో ఎన్నో పోరాటాలు చేసి చివరకు విగ్రహ ఏర్పాటుకు స్థలం సాధించుకుని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చే విగ్రహాన్ని ప్రారంభించారు. శనివారం నాడు విగ్రహ స్థలం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీను మాట్లాడుతూ గాజువాక కూడలిలో డివైడర్ పై ఉన్న విగ్రహం చుట్టూ రైలింగ్, మొక్కలు మరియు పార్క్ ను ఏర్పాటు చేయాలని జీవీఎంసీ ఉన్నతాధికారులకు కోరారు. రాబోయే అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురస్కరించుకుని గాజువాక కూడలిలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద జీవీఎంసీ అధికారులు సుందరీకరణ పనులు చేపట్టి అక్టోబర్ నాటికి ఆ ప్రాంతం ఆహ్లాదకరమైన వాతావరణంగా మార్చాలని కోరారు. ఇప్పటివరకు విగ్రహం ఏర్పాటుకు కృషి చేసిన నాయకులకు అధికారులకు ఈ సందర్భంగా శ్రీను కృతజ్ఞతలు తెలిపారు.

# చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు
### అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ



**అచ్చుతాపురం, మే 25, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో ఎన్నికల వేళ జరుగుతున్న అల్లర్లపై అనకాపల్లిజిల్లా ఎస్పీ మురళీకృష్ణ కీలక సూచనలు చేశారు. శనివారం అచ్యుతాపురంలో ఓ ప్రైవేట్ కళ్యాణ్ మండపంలో ఎలమంచిలి నియోజకవర్గ కీలక నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల ఓట్ల లెక్కింపు సమయంలో నియోజకవర్గ ప్రజలంతా శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని కోరారు. కౌంటింగ్ సమయంలో ప్రశాంత వాతావరణానికి సహకరించాలి. రాజకీయ వివాదాల్లో చిక్కుకొని యువత బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దు. ప్రజలందరూ కూడా న్యూస్ ఛానల్లో ప్రచారమైయ్యే కౌంటింగ్ అప్డేట్స్ తెలుసుకోవాలని కోరుతున్నా. రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంది. ప్రజలేవ్వరూ కూడా అల్లర్లకు సహకరించరాదు. ఎన్నికల్లో కేసు నమోదు అవుతే 30 సంవత్సరాల వరకు ఓటు వేయడం ఉండదు సరి కదా ఎన్నికల సమయానికి బైండోవర్ కేసు నమోదు చేసి స్టేషన్కు తరలిస్తామన్నారు. ఫలితాలు రోజు ర్యాలీలు బాణసంచా కాల్చడంపై నిషేధం ఉందన్నారు. గ్రామాల్లో ఉన్న నాయకులే ఈ మేరకు ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సిఐలు నాలుగు మండలాల ఎస్సైలు , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెద పైడిమాంబ జాతరకు భారీ ఏర్పాట్లు



**కె. కోటపాడు, మే 25, మేజర్‌న్యూస్:** ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు అయిన పెద పైడిమాంబ పండగ అతి వైభవంగా జరుపు తున్నట్లు ఉత్సవ కమిటీ తో పాటు గ్రామ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు తెలిపారు. మండలంలో మేజర్ పంచాయతీ చౌడువాడ గ్రామంలో వెలసిన శ్రీ పైడిమాంబ జాతరను ప్రతి ఐదు సంవత్సరాలకు వచ్చే ఈ ఉత్సవం ఈనెల 26 నుంచి 28 వరకు అతి వైభవంగా జరుపుతామని ఉత్సవ కమిటీ తెలిపింది. 15 రోజుల క్రితం నుంచి గ్రామంలో చాటింపుతో పండగ వాతావరణం నెలకొన్నది. గత పది రోజుల నుండి అమ్మవారి ఘటాలు ఉదయం, సాయంత్రం నియమ నిష్టల తో ఊరేగింపు చేస్తున్నారు. ముఖ్యంగా ఉత్సవ కమిటీలో గ్రామ సర్పంచ్ ఎరుకు నాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, విశాఖ డైరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, ఉత్సవ కమిటీ సభ్యుల దగ్గరుండి మరి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. 26వ తేదీ ఆదివారం సాయంత్రం నుండి గ్రామం చుట్టూ గ్రామంలో ప్రజలకు, పిల్లలకు, పశు,పక్షాదులకు, ఏ చీడ,పీడలు లేకుండా పంటలు బాగా పండాలని గ్రామం సుభిక్షంగా ఉండాలని పైడిమాంబ దగ్గర పూజించిన అక్సింతలను 26వ తేదీ ఆదివారం రాత్రి అమ్మవారి ఘటాలు గుర్రాలు కాగడాలతో గ్రామం మొత్తం తిరుగుతూ అంక్షితలు జల్లే కార్యక్రమం ఉంటుందని ఉత్సవ కమిటీ తెలిపారు. అలాగే భారీ మందు గుండు ప్రదర్శన కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పైడిమాంబ అమ్మవారి మొక్కులు తీర్చుకునేందుకు ఉత్తరాంధ్ర జిల్లాలే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా వస్తారని, దీనికి తగ్గట్టుగా ఏర్పాటు చేశామనిఉత్సవ కమిటీ తెలిపింది. చివర రోజు మంగళవారం 28వ తేదీన భారీ ప్రభ, రథోత్సవం తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నేల ద్యాన్సులు పులివే శాలతో రథోత్సవంతో ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే గ్రామం అంతటా విద్యుత్ దీప అలంకరణ, భారీ ప్రభలు తయారీలో నిమగ్నమై ఉన్నారు. జాతర ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు తెలిపారు.

# రొట్ట విత్తనాలు రైతుల సద్వినియోగం చేసుకోండి
### మండల ఏవో సంధ్య రత్నప్రభ



**ఆనందపురం, మే 25, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండలంలో పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతుల ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సంధ్యా రత్నప్రభ తెలిపారు అందులో భాగంగా జీలుగ-16.2 క్వింటాల్, జనుము- 7.5 క్వింటాల్, పిల్లిపెసర - 3.6 క్వింటాల్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి పచ్చి రొట్ట విత్తనాలు కావలసిన రైతులు తమ దగ్గిరలో ఉన్న రైతు భరోసా కేంద్రాలలో ఉంటాయని పచ్చి రొట్ట విత్తనాలు వాడటం వలన భూమి సారాన్ని కాపాడటమే, కాకుండా నీటి యొక్క నిలువ సామర్థ్యాన్ని పెంపొందిపచేస్తుంది. అదే విదంగా యూరియా యొక్క వినియోగాన్ని తగ్గించుకోవచ్చు అని ఏవో తెలిపారు.

# శాస్త్రవేత్తలుకు రైతులకు మధ్య ఆర్‌బికే సిబ్బంది వారధిలా పని చేయాలి
### జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు



**రావికమతం, మే 25, మేజర్‌న్యూస్:** వ్యవసాయ శాస్త్రవేత్తలు కు రైతులకు మధ్య రైతు భరోసా కేంద్ర సిబ్బంది వారధి లా పనిచేయాలని అనకాపల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్ రావు పిలుపునిచ్చారు. బుచ్చయ్యపేట మండలం కొండంపుడి కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం అనకాపల్లి, నర్సీపట్నం గొలుగొండ రావికమతం బుచ్చయ్యపేట తదితర మండలాలకు చెందిన రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి శిక్షణ శిబిరం నిర్వహించారు. నూతన వరి , వేరుశనగ అపరాల వంగడాలు ను అనకాపల్లి రైతు శిక్షణా కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు తెలియజేశారు. అలాగే సస్యరక్షణ, చీడపెడల నివారణ, ఆధునిక వ్యవసాయం, వ్యవసాయ యాంత్రికరణ, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం విషయాలపై కూడా ఆర్.బి.కె సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆర్ధిక సిబ్బంది రైతులకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావికమతం మండల వ్యవసాయ అధికారిణి రూప, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు సత్తిబాబు,, రాజకుమార్ , నర్సీపట్నం వ్యవసాయ సంచాలకులు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# కాంబోడియా, కిర్గిజిస్థాన్ సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు



**విశాఖపట్నం, మే 25, మేజర్‌న్యూస్:** విదేశాంగ శాఖ జాగ్రత్త వహించాలని పార్లమెంటు మాజీ సభ్యు లు, విశాఖ వైస్సార్సీపీ ఎంపీ అభ్యర్ధి డాక్టర్ బొత్స ఝూన్సీలక్ష్మి సూచించారు. శనివారం ఈ మేరకు ఆమె ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్య అభ్యసించాలని భారత్ నుంచి వెళ్లిన వేలాది మంది మాదిరిగా విశాఖపట్నం నుంచి వెళ్లిన విద్యార్థులు కిర్గిజిస్తాన్ వెళ్లారని అక్కడ యూనివర్సిటీ లలో చెలరేగిన హింస వలన స్థానికులైన విద్యార్థులు అక్కడ ఇబ్బంది పడుతున్నారని అన్నారు. భారత విదేశాంగ శాఖ వీరి భద్రత పట్ల మరిన్ని చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. ఉన్నత ప్రమాణాలు కలిగిన వైద్య విద్య కొంత ఖరీదైన వ్యవహారంగా మారడంతో కిర్గిజిస్తాన్ వంటి దేశాలకు ఎన్నో ఆశలతో వెళ్లిన విద్యార్థులకు తక్షణ సహాయక చర్యలు అందుబాటులో ఉండేలా కిర్గిజిస్తాన్ లోని భారత ఎంబసీ చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగా లు ఇప్పిస్తామని చెప్పి విశాఖ చుట్టుపక్కల 100మంది అభ్యర్థులను మోసంతో కాంభోడియా దేశం పంపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఝూన్సీ లక్ష్మి కోరారు. ఈ రాకెట్ ను చేధించి 60 మందిని సురక్షితంగా స్వదేశానికి రప్పించిన విశాఖ పోలీస్ కమీషనరేట్ ను ఆమె అభినందించారు. విశాఖకు చెందిన మిగిలిన వారిని వెంటనే రప్పించే ఏర్పాట్లు చేయాల్సిందిగా ఝూన్సీలక్ష్మి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విదేశీ విద్య, ఉద్యోగ అవకాశాల పట్ల యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రభుత్వాలు వీటి పట్ల ప్రత్యేక పర్యవేక్షణ చర్యలు పెంచాలనిఝూన్సీ లక్ష్మి కోరారు.

# విశాఖ షిరిడి సాయి బ్రహ్మోత్సవములు
### ఆలయ చైర్మన్ బి.వి రమణ కుమార్, ఉదయ్ లక్ష్మి



**ఆరిలోవ, మే 25, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ 9వ వార్డు, సంజయ్ గాంధీ కాలనీ లో వెలసిన విశాఖ షిరిడి సాయి బాబా వార్షికోత్సవ వేడుకలు విశాఖ శిరిడి సాయి సంస్థాన్ ఆధ్వర్యంలో జూన్ 2 నుంచి మూడు రోజులు పాటు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ బి.వి రమణ కుమార్ ఐ.పి.ఎస్( రిటైర్డ్ ), ప్రెసిడెంట్ బి. ఉదయలక్ష్మి ఐ ఏ ఎస్ ( రిటైర్డ్ ) తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సాయిబాబా ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమణ కుమార్ మాట్లాడుతూ గతంలో ఇక్కడ మా ఇల్లు ఉండేదని మాకు సాయిబాబా కళ లో కనిపించి తన మందిరం నిర్మించమని చెప్పడంతో మా సొంత నిధులతో నిర్మాణాన్ని చేపట్టామని చెప్పారు. ఏడవ వార్షికోత్సవం ఘనంగా జరుపుటకు పోస్టర్ ను విడుదల చేశారు. జూన్ 2 న బాబాకు 108 కలశాలతో అభిషేకం, కుంభాభిషేకం, పల్లకి సేవ, నక్షత్ర హారతి , 3 న సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుండి భారీ అన్నదాన ప్రసాద వితరణ , 4న కోలాటాలు భక్తి భజన కార్యక్రమం పల్లకి ఊరేగింపు తో ముగియనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు బాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించవలసిందిగా కోరారు. బాబాను దర్శించుకునేందుకు భారత ప్రభుత్వ విధానకర్త, ప్రధాని పూర్వ సలహాదారులు బ్రిజ్ కిషోర్ ను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సాయి శర్మ తదితరులు పాల్గొన్నారు.

### బ్రహ్మోత్సవాల్లో భాగంగా
## సామూహిక సహస్రనామ కుంకుమార్చన



**భీమునిపట్నం, మే 25, మేజర్‌న్యూస్:** భీమిలి లో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి వారి షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 7.00 గం కు, శ్రీవారి సన్నిధిలో కొలువై ఉన్న శ్రీ ఐశ్వర్యలక్ష్మి అమ్మవారికి పుణ్య స్త్రీల స్వహస్తములతో సామూహిక సహస్రనామ కుంకుమార్చన అత్యంత వైభవోపేతముగా, జరిగినది. ఈ కార్యక్రమం శ్రీమాన్ ముప్పిరాల అనంతాచార్యులు మరియు ఆలయ ప్రధానార్చకులు శ్రీమాన్ పురాణం శేషాచార్యులు మరియు శిష్య బృందం మనోజ్, విష్ణు వారి ప్రత్యక్ష పర్య వేక్షణలో జరుగగా, ఆలయ ట్రస్టీస్ శ్రీ కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి, కలిగొట్ల సూర్య నారాయణ మూర్తి, కలిగొట్ల భానోజీరావు, కలిగొట్ల శ్రీనివాసరావు, కోశాధికారి వి.బంగార్రాజు, కలిగొట్ల వారి కుటుంబ సభ్యులు మరియు భీమిలి పరిసర ప్రాంత అశేష భక్త జనులు పాల్గొన్నారు.

### ఖరీఫ్ సీజన్ పలు రకాల
## విత్తనాలుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు
### విక్రయానికి సిద్దంగా ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు



**పద్మనాభం, మే 25, మేజర్‌న్యూస్:** రానున్న ఖరీఫ్ సీజనకు సంబందంచి పలు రకాల విత్తనాలు కోసం మండల వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం సబ్సిడీపై ఇవ్వనున్న వరి, వేరుశనగ, పెసర, మినుములు తదితర విత్తనాలను అధికారులు సిద్దం చేస్తున్నారు. వర్షాబావ పరిస్థితుల వల్ల ఇప్పటికే తొలకరి పంటలు పోయాయని రైతులు లబోదిబో మంటున్నారు. దీంతో ఇప్పటినుండే వరి నారుమడులను, వేరుశనగ వేయడానికి దుక్కులు దున్ని సిద్దం చేస్తున్నారు. అయితే వరివిత్తనాలు సోనామసూరి రకం 447 క్వింటాళ్లు, సాంబామసూరి రకం 130క్వింటాళ్లు, 1121 రకం 685 క్వింటాళ్లు, వేరుశనగ 15 క్వింటాళ్లుకి ప్రతిపాదనలు పంపినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవిఎస్ చలం చెప్పారు. అయితే ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలు జీలుగు,జనుం, పిల్లిపెసర రైతుభరోసాలలో విక్రయానికి సిద్దంగా ఉన్నాయని ఆయన అన్నారు. జీలుగు,జనుము పది కేజీల విత్తనాల ప్యాకెట్ పూర్తి ఖరీదు 880 రూపాయలు కాగా సబ్సిడీ పోను సగం రేటుకే లభిస్తాయని ఆయన తెలిపారు. అలాగే పిల్లిపెసర ఎనిమిది కేజీల ప్యాకెట్ పూర్తి ఖరీదు కాగా సగం రేటుకే లభిస్తాయని ఆయన అన్నారు.

## ఎర్రవరంలో ఎలక్షన్ కౌంటింగ్‌పై అవగాహన



**అచ్చుతాపురం, మే 25, మేజర్‌న్యూస్:** మండలంలో ఎర్రవరం గ్రామంలో శుక్రవారం రాత్రి డి ఎస్ పి సత్యనారాయణ,సిఐ ఎమ్ బుచ్చి రాజు, ఎస్ ఐ నారాయణరావు ఎటువంటి గొడవలు లేకుండా అందరూ కలిసి ఉండాలని ఇరుపార్టీల నాయకులుకు గ్రామస్తులకు సమావేశం ఏర్పాటు చేసి తెలియజేశారు.

### ఘనంగా శ్రీ కనకమహాలక్ష్మి
## (దుర్గ) అమ్మవారి వార్షిక జాతరోత్సవాలు



**విశాఖపట్నం, మే 25, మేజర్‌న్యూస్:** చినవాల్తేరులో వేంచేసియున్న శ్రీ కనకమహాలక్ష్మి (దుర్గ) అమ్మవారి వార్షిక జాతర మహెూత్సవములు ఈ నెల 6నుండి వచ్చే నెల 5వ తేదీ వరకూ అత్యంత వైభవముగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూట ివ్ ఆఫీసర్ కె. గాయత్రి తెలియ జేసారు. శ్రీ అమ్మవారి తోలేళ్ళు ఈ నెల 27న, అమ్మవారి జాతర 28న అత్యంత వైభవము గా జరుపబడుతుం దన్నారు శ్రీ కనకమహాలక్ష్మి (దుర్గ) అమ్మవారు చుట్టూ ప్రక్కల చినవాల్తేరు గ్రామప్రజలు ప్రజలకు ఆరాధ్య దేవత సదరు ఉత్సవములలో విశాఖపట్నం జిల్లా చుట్టూ ప్రక్కల గ్రామాల నుండి శ్రీ అమ్మవారి దర్శనార్థం భక్తులు వచ్చి తీర్థ ప్రసాదములు స్వీకరిస్తారు. ఈ జాతర ఉత్సవములు సందర్భంగా అత్యంతవైభవముగా విద్యుత్ అలంకరణ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేయుట, దర్శనార్థం వచ్చిన భక్తులకు ఉచిత పులిహెూర ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేయుట, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం వారు క్యూ లైన్లు ఏర్పాటు చేయుట మరియు దేవాలయ సిబ్బందిని డిప్యూటేషన్ పై నియమించినట్లు పేర్కొన్నారు. శ్రీ అమ్మవారి జాతరను ఈ సంవత్సరం ధ్రువ నేత్ర కల్చరల్ క్లబ్ వారు జరుపుచున్నారని చెప్పారు. తొలి పూజకు గాను రూ. 250లు చెల్లించిన భక్తులకు శ్రీ అమ్మవారికి పంచామృతాభిషేకం జరిపించబడుతుంది. ఈ పూజకు ఇద్దరికి (2) మాత్రమే ప్రవేశం ఉంటుంది.. ఈ పూజలో పాల్గొనే భక్తులు 27వ తేదీ సాయంత్రం లోగా రుసుము చెల్లించి రశీదు పొందవలెను. రూ. 20టికెట్ తీసుకోనువారు శ్రీఘ్ర దర్శనం కల్పించబడును. భక్తులకు ఉచిత దర్శనం ఏర్పాటు చేయబడింది ఈ సంవత్సరం జాతర ఖర్చు నిమిత్తం రూ 4,50,000 రూపాయలు వ్యయపరుస్తున్నట్లు కార్యనిర్వహణాధికారిణి కె. గాయత్రి తెలిపారు.



## తోటపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

- దాతల సహకారంతో అన్న సమారాధన కార్యక్రమం
- ఈవో వి వి సూర్యనారాయణ వెల్లడి



**గరుగుబిల్లి, మే 25, మేజర్‌న్యూస్:** పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం తోటపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం, ఉత్తరాంధ్ర చిన తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, మంగళశాసన ములు, విశేష హెూమములు, తదితర పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు వి వి అప్పలాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అదేవిధముగా ఆయా ప్రాంతాల నుంచి శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నసమారాధన కార్యక్రమంను ఏర్పాటు చేయడం జరిగిందని దేవస్థానం కార్య నిర్వహణాధికారి వి వి సూర్యనారాయణ తెలిపారు. ఈకార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది గంట శ్రీధర్ నాయుడు , పెదారపు పోలిరాజు, తదితరులు పాల్గొన్నారు.

## అచ్చుతాపురం హైస్కూల్ను ప్లస్ క్లాస్లుగా మార్పు



**అచ్యుతాపురం, మే 25, మేజర్‌న్యూస్:** స్థానిక జెడ్ పి హైస్కూలును ఈ విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ ప్లస్ గా మార్చారని హైస్కూల్ ప్రధాన ఉపద్యారాలు పద్మావతి తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరంలో ఎమ్ పి సి,బైపిసి,సీఈసీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని తెలియజేశారు. విద్యార్థి, విద్యార్థినిలు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ మేరకు ఇంటి ఇంటికి వెళ్ళి ప్రచారం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీనువాసరావు, విసిహెచ్ పార్వతి,కె.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## కొయ్యవారి కళ్లాల ప్రజలకు మంచినీరు ఇప్పించండి మహా ప్రభో



**పద్మనాభం, మే 25, మేజర్‌న్యూస్:** మండలంలో చిన్నాపురం,నేరెళ్లవలస గ్రామాల జంక్షనులో ఎన్ టి.ఆర్.విగ్రహం సమీపంలో ఉన్న కొయ్యవారి కళ్లాలలకు మంచినీరు ఇప్పించండి మహాప్రభో అని కళ్లాల ప్రజలు అధికారులను,ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు. ఇక్కడ సుమారు పదిహేను కుటుంబాలు,కళ్లాలు ఉన్నాయి. ఈ కళ్లాల ప్రజలకు చాలా సంవత్సరాల నుండి మంచినీటి బోరుగాని,కుళాయిలను గాని ఏర్పాటు చేయడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారు. దీంతో ఈ కళ్లాల ప్రజలు తాగునీటికి నానా అవస్థలు పడుతున్నారు. మండల అధికారులకు మంచినీరు కోసం ఎన్నిసారులు ఫిర్యాదులు చేసినా స్పందన లేదని ప్రజలు వాపోతున్నారు. అయితే అదే జంక్షను మీదుగా చిన్నాపురం గ్రామానికి వెలుతున్న పైపులైనుకు కన్నం పడడంతో ఆవచ్చిన నీటిని గతిలేక పట్టుకుంటున్నారు. ఇప్పటికైన అధికారులు, పాలకులు స్పందించి కొయ్యవారి కళ్లాలకు తాగునీటిని ఇప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## కోడూరు రక్తదాన శిబిరంలో పాల్గొన్నా ఎస్ ఐ జయంతి




**బాడంగి, మే 25, మేజర్‌న్యూస్:** యువత రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని బాడంగి సబ్ ఇన్ స్పెక్టర్ రావాడ జయంతి అన్నారు మండలం లోని కోడూరు గ్రామంలో శనివారం జరిగిన స్వచ్ఛంద రక్తదాన శిబిరం అమ్మ సేవ ఫౌండేషన్ అధ్యక్షులు డి.సురేష్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా ఎస్ ఐ ఆర్ జయంతి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత అధిక సంఖ్య లో రక్తదాన శిబిరంలో పాల్గొనడం శుభపరిణామం అన్నారుఇలాంటి కార్యక్రమాలు చేసేటప్పుడు తన వంతు సహకారం ఎప్పుడు ఉంటుందని ఆమె తెలిపారు అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేయడం వలన సదరు మనిషి ప్రాణాలు కాపాడి,వారి కుటుంబానికి మంచి సమాజానికి సేవ చేసేవాళ్ళం అవుతామని అన్నారు ఈ కార్యక్రమం లో వారి తో పాటు ఏ ఎస్ ఐ కొండలరావుసహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు సాయి కుమార్,యన్ వి యన్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వర రావు,సమాజ సేవకులు వి .తిరుపతిరావు,ఫౌండేషన్ కార్యదర్శి కె సాయి,సభ్యులు ,కోడూరు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సహాయం కోసం ఎదురు చూపు



**మాడుగుల, మే 25, మేజర్‌న్యూస్:** మండలంలోని ఎం.కోడూరు గ్రామానికి చెందిన గొర్లి సతీష్ రాజ్ సుమారుగా ఒక సంవత్సరం క్రితం విద్యుత్ షాక్ తగిలి పెద్ద ప్రమాదం జరిగి నేటికి మంచానికి పరిమితమయ్యారు. వాళ్ల కుటుంబ సభ్యులు నిరుపేద కుటుంబం వలన ప్రతీ నెల వైద్యం చేయించడానికి చాలా ఇబ్బంది పడుతున్న దృష్ట్యా దాతలు ఎవరు అయినా సహకరించండి అని ప్రాధేయ పడుతున్నారు. ఈ మేసేజ్ చూసిన ప్రతీ ఒక్కరూ మీకు తోచిన రీతిలో ఎంతో కొంత సహాయం చేయాలని కోరుతున్నారు. సహాయం చేయదలచిన వారు 9985322668 నల్లబిడ్డి నాగరాజు (శ్రీ విఘ్నేశ్వర పెయింటర్ అసోసియేషన్)కు పంపించాలని కోరుతున్నాడు.

# జ్వరాలు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తెర్లి జగన్మోహనరావు వెల్లడి
- గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుకు చర్యలు



**గరుగుబిల్లి, మే 25, మేజర్‌న్యూస్:** గ్రామపంచాయతీల్లో ప్రస్తుత సీజన్ లో జ్వరాలు ప్రబలకుండా ఉండేలా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి(డిఎంఒ) డాక్టర్ తెర్లి జగన్మోహనరావు ఆదేశించా రు. ఈమేరకు కొమరాడ మండలం అంటివలస గ్రామంలో జ్వరాలు ప్రబలాయన్న సమాచారం మేరకు శనివారం గ్రామాన్ని డాక్టర్ జగన్మోహనరావు ఎంపీడీవో మల్లికార్జునరావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య సిబ్బంది నిర్వహించిన వైద్య శిబిరాన్ని తనిఖీచేశారు. వైద్య సిబ్బంది చేపట్టిన ఫీవర్ సర్వేలో నిర్ధారణ పరీక్షలను పరిశీలించగా ఇద్దరికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా జ్వరంతో బాధపడుతున్న వ్యక్తి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. ఎమ్ పిడిఓ తో కలిసి గ్రామంలో సందర్శించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి, దోమల నివారణకు తగు చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. గృహ సందర్శన చేసి జ్వారాలపై ఆరా తీసి వారి ఆరోగ్య స్థితిని పరిశీలించారు. గ్రామంలో జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచుతూ పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజారోగ్యం దృష్ట్యా వైద్య సేవలందించే విషయమై తక్షణమే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శామ్యూల్,ఏఎమ్ఓ సూర్యనారాయణ, ఇఓపిఆర్డి మద్రాపు రాధాకృష్ణ ,సిహెచ్ఓ బంగారుబాబు, వైద్య సిబ్బంది సురేష్, సరస్వతి, మాధురి, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## వేసవి విజ్ఞాన శిబిరంకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరు

- గ్రంధాలయనిర్వాహకులు మధుసూదనరావు
- విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహణ

**గరుగుబిల్లి, మే 25, మేజర్‌న్యూస్:** మండల కేంద్రంలోని శాఖా గ్రంధాలయంలో నిర్వ హిస్తున్న వేసవి విజ్ఞానశిబిరం కొనసాగుతోంది. ఈకార్య క్రమంలో భాగంగా విద్యార్థులకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నా రు. ఈమేరకు స్టోరీ టెల్లింగ్ లో భాగముగా శనివారం కందుకూరి వీరేశిలింగం పంతులు జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు చదివి వినిపించారు. అదేవిధంగా క్రీడా పోటీల్లో భాగంగా చదరంగం క్యారం బోర్డు తదితర ఆటల పోటీలను నిర్వహిం చామని శాఖా గ్రంధాలయం నిర్వాహకులు నల్ల మధుసూద నరావు తెలిపారు. అదేవిధం గా ప్రతిరోజు వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగం గా పలు కార్యక్రమాలను నిర్వహిం చడం జరుగుతుందని ఈ సందర్భంగా మధు సూద నరావు పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి



మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం ను నిర్వహించడం జరుగు తుంద న్నారు. ఈవేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొంటు న్నార ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సేవలు వెలకట్టలేనిది

మాజీ వైస్ ఛాన్సలర్: డాక్టర్ ముర్రు ముత్యాల నాయుడు



**కే కోటపాడు, మే 25, మేజర్‌న్యూస్:** తాను చదువుకున్న పాఠశాలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో సొంత నిధులు వెచ్చించి సభా వేదిక నిర్మించడం ఎంతో గొప్ప విషయమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ పూర్వపు వైస్ ఛాన్స లర్ డాక్టర్ ముర్రు ముత్యాల నాయుడు కొనియాడారు. మండలం లోని చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వపు విద్యార్థి గణపతి రాజు లక్ష్మీనరసింహరాజు తన మాతృమూర్తి పేరున తొమ్మిది లక్షల రూపాయలు వెచ్చించి విద్యార్థులకు చక్కని సభావేదిక నిర్మించారు. దీనికి ముఖ్యఅతిథిగా ముర్రు ముత్యాల నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ముత్యాల నాయుడు మాట్లాడుతూ ఉన్నత స్థితిలో ఉన్న పూర్వ విద్యార్థులు వారు చదువుకున్న పాఠశాలకు సేవ చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు సృజన వాణి వ్యవస్థాపక అధ్యక్షులు రాళ్లపల్లి రవికుమార్ సభా వేదికను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బిర్లంగి రామ నరేష్, స్థానిక హెచ్ఎం ఈర్లే అప్పారావు, పూర్వ విద్యార్థులు దాట్ల చంద్రశేఖర వర్మ, జి జి శర్మ, ఆవు గడ్డ పాత్రుని నాయుడు, కొణతాల సూర్యనారాయణ, గౌరుపోటు రామ్మూర్తి , రాళ్లపల్లి శ్రీరామ్మూర్తి, బొడ్డేడ నాగరాజు, దాడి వెంకట సూర్యనారాయణ తదితర 100 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# అరకులోయలో 2వేల మందికి అన్న సంతర్పణ



**అరకులోయ, మే 25, మేజర్‌న్యూస్:** స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ఆవరణలో గల కళ్యాణ మండపం వద్ద అన్న సంతర్పణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అరకులోయలో కొలువుదీరిన అలివేలు మంగా, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మహెూత్సవాలు ముగిసిన సందర్భంగా శ్రీ వెంకన్న కళ్యాణోత్సవ కమిటీ, ఆలయ అభివృద్ధి కమిటీలు సంయుక్తంగా నారాయణ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 2,000 మందికి పైబడి భక్తులు అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. అన్న సంతర్పణ కార్యక్రమంపై ముందుగా విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించడంతో ఊహించిన దానికంటే ఎక్కువమంది భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొని విజయవంతం చేయడంతో పాటు అన్న సమారాధన కార్యక్రమానికి హాజరైన భక్తజనంకు శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవ కమిటీ చైర్మన్ శీలం. అప్పలరామ్, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సమర్ధి.రఘునాథ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవ కమిటీ, శ్రీ వెంకన్న ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కె. రామారావు,కె.అప్పు, అర్జున్,గెమ్మెలి.బాబురావు, పైడిరాజు,కె.కామేష్, పాడి చందు, చిట్టిబాబు, బొంజిబాబు,కాపుగంటి.కృష్ణారావు,రంగా, తిరుపతిరావు, పలు ప్రాంతాల భక్తులు, గిరిజనులు పాల్గొన్నారు.

# ర్యాలీలు, బహిరంగ సభలకు అనుమతులు లేవు

నర్సీపట్నం రూరల్ సీఐ హరి



**గొలుగొండ, మే 25, మేజర్‌న్యూస్:** జూన్ 4వ తేదీన ఎన్నికల కోడ్ కారణంగా ర్యాలీలు, బహిరంగ సభలకు అనుమతలు లేవని నర్సీపట్నం రూరల్ సీఐ హరి అన్నారు. గొలుగొండ పోలీస్ స్టేషన్ లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎస్సై కృష్ణారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించి కౌంటింగ్ పూర్తి అయి ఎన్నికల ఫలితాలు వెలువడునా సందర్భంలో గ్రామాల్లో డీజే సౌండ్స్, ఊరేగింపులు, బాణా సంచా ర్యాలీలు నిషేధమన్నారు. నిబంధనలు ఎవరు ఉల్లంఘించన చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. కాబట్టి నాయకులు పార్టీలకు అతీతంగా గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు సమన్వయంతో ఉండాలని సూచించారు.

# క్రికెట్ అంపైర్, స్కోరర్ల వేతనాల పెంపు

ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి



**విశాఖపట్నం, మే 25, మేజర్‌న్యూస్:** విధి నిర్వహణలో అంకిత భావం, కృషి, నైపుణ్యాన్ని గుర్తించి అంపైర్, స్కోరర్ల తో పాటు ఇతర మ్యాచ్ అఫిషియల్స్‌కు వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసు కున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి తెలిపారు. పెంచిన వేతనాలు ఈ నెల 25వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయన్నారు. వేతనాల పెంపువల్ల మ్యాచ్ అధికారుల ఆర్థిక శ్రేయస్సును పెంపొందించడమే కాకుండా మెరుగైన క్రీడా ఈవెంట్‌ల నిర్వహణకు దోహదం చేస్తాయని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగేళ్ల తర్వాత వారికి వేతనాలు పెంచుతూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్ణయం తీసుకోవడంతో మ్యాచ్ అఫిషియల్స్ అందరూ సంతోషం వ్యక్తం చేస్తూ ఏసీఏ అధ్యక్ష, కార్యదర్శులు పి.శరత్ చంద్రారెడ్డి, ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డిలకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా, జోనల్ స్థాయి అంపైర్లకు రోజుకు రూ. 1,500 నుంచి రూ. 2,500, స్కోరర్లకు రూ. 800 నుంచి రూ. 1,500లకు వేతనం పెంచారు. టోర్నమెంట్ ఆర్గనైజ్ చేస్తే అంపైర్లకు రూ. 2 వేల నుంచి రూ. 3 వేలు, స్కోరర్లకు రూ. వెయ్యి నుంచి రూ. 2 వేలు, అదేవిధంగా డైలీ అలవెన్స్ కూడా పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి తెలిపారు.

## పెదనందిపల్లిలో సత్యసాయి మండల సమావేశము



**దేవరాపల్లి, మే 25, మేజర్‌న్యూస్:** మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో భగవాన్ శ్రీ సత్యసాయి సేవాసంస్థల మండల సమావేశం అనకాపల్లి జిల్లా నూతన అధ్యక్షులుగా నియమించబడిన కశిరెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో మొట్ట మొదటగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో అక్టోబరు నెలలో 23, 24, 25 తేదీలలో జరుగబోయే పర్తియాత్ర ఏర్పాట్లు గురించి, మండలంలో గ్రామ సేవలు, ఆధ్యాత్మిక సమావేశాలు, భజనలు, బాలవికాస తరగతులు తదితర అంశాలను గురించి తెలియజేశారు. దేవరాపల్లి మండల అధ్యక్షులుగా ఆదిరెడ్డి కన్నబాబును నూతనంగా నియమించడం జరిగినదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్లు, నౌడు అప్పారావు, గంధం సూర్యం, రమామణి, సిహెచ్ వి రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శిఖరాలు

**అచ్చుతాపురం, మే 25, మేజర్‌న్యూస్:** శాఖా గ్రంధాలయంలోనేటివరకు కొనసాగుతున్న విజ్ఞాన వేసవి శిబిరాల్లో భాగంగా ఈరోజు అచ్యుతాపురం శాఖా గ్రంధాలయం నకు వివిధ స్కూలు నుండి విద్యార్థినిలు విద్యార్థులు సుమారు 15 మంది పాల్గొని ఉన్నారు వారికి జ్ఞానంపై శిక్ష న ఇచ్చేటందుకు మాడం అప్పారావు పిల్లలకు జ్ఞానంపై శిక్ష ఇస్తూ కొన్ని సూచనలు కూడా వివరించారు ప్రతి ఒక్కరు కూడా తెల్లవారి జామున 5 గంటల నిద్ర మేలుకొని ఒక గంట సమయాన్ని ఈ యొక్క జ్ఞానంలో నిమగ్నులై వివిధ రకములైన జ్ఞాన పాటించి ఆచరించాలిఅలా ఆచరించిన నట్లయితేమీలో మేధాశక్తి పెరుగుదలకు ఆరోగ్యము మెరుగుపడుటకు రక రకముల చెడు ఆలోచనలు తోలుగుటకు మంచి అవగాహన కాబట్టి ప్రతి ఒక్కరు కూడా జ్ఞానం యాగాసనాలు కూడా చేయవచ్చు ను అని ఆయన వివరించారు అనంతరం స్థానిక లైబ్రేరియన్ డి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ విజ్ఞానశిబిరానికి వచ్చిన పిల్లలకు స్వీట్లు కూడా పంచడమైనది అనిఆయన వివరించారు.

## పంట కాలువల్లో పూడికతీత పనులు



**దేవరాపల్లి, మే 25, మేజర్‌న్యూస్:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో దేవరాపల్లి రెవెన్యూ పరిధిలో పంట కాలువలు పూడికతీత పనులు శనివారం రైతు కూలీలు చేపట్టారు ఇందులో ఇరిగేషన్ కాలువ నుంచి కొన్నివానిపాలెం వరకు, ఉయ్యాల చింతగడ్డ నుంచి వడ్డిచింతల వారి కల్లాల వరకు, పైడమ్మ చెరువు నుంచి కర్రి వాని చెరువు వరకు వ్యవసాయ భూములకు నీరు వెళ్లే విధంగా కాలువలు పూడిక తీర్థ తుప్పలు తొలగింపు పనులు చేశారు దీంతో పంటలకు నీరు ఏటువంటి ఆటంకం లేకుండా వస్తుందని రైతులు తెలిపారు పూర్తిస్థాయిలో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే వ్యవసాయ పనులు కు కూలీలు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నామని అందుచేత ప్రభుత్వం రైతులు కష్టాన్ని అర్థం చేసుకొని ఉపాధి పనిని వ్యవసాయానికి అనుసంధానం చేస్తారని రైతులు కోరుతున్నారు.

## గుర్ల మండల టీడీపీ సీనియర్ నాయకుడు మృతి



**గుర్ల, మే 25, మేజర్‌న్యూస్:** మండలంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తిరుమల రాజు రాఘవ రాజు శనివారం ఉదయం తుది శ్వాస విడిచారు. గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. స్వర్గీయ రాష్ట్ర మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు ప్రస్తుత మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వారితో అప్పట్లో కాంగ్రెస్ పార్టీలో ఒక వెలుగు వెలిగారు. తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పొట్నూరు సూర్యనారాయణ వారితో పనిచేసే తెలుగుదేశం పార్టీని అంచెంచునుగా పార్టీని అభివృద్ధి చేశారు. ఈ ప్రాంతంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా నాయకుడిగా పేరు సాధించారు తరువాత వారి కోడలు పద్మిని మండల జడ్పిటిసిగా సేవలు అందించారు జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు గా తన కుమారుడుటీ కిరణ్ రాజు తెలుగుదేశం పార్టీలో కీలక వ్యక్తిగా పేరు ఉంది. గరివిడి దగ్గరలో గల వద్ద అయన భౌతికకాయం సందర్శనార్థం ఉంచారు. కడసారి చూసి ఎందుకు వివిధ ప్రాంతాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు తరలివచ్చారు.

## వచ్చే నెల 17న వెంకన్న కల్యాణం



**మాడుగుల, మే 25, మేజర్‌న్యూస్:** మాడుగుల మండలం కేజే.పురం జంక్షన్ లో వేంచేసి ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు జూన్ 17 తేదీ నుంచి నిర్వహించను న్నట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామ కొండలరావు శనివారం తెలిపారు. జూన్ 22వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ 17 తేదీ మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. వారం రోజులు పాటు స్వామివారి ఉత్సవాలు జరుగుతాయన్నారు.

## గ్రంధాలయంలో బుక్ రీడింగ్



**గొలుగొండ, మే 25, మేజర్‌న్యూస్:** గొలుగొండ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమలో పది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల లెక్కింపు రోజున విజయోత్సవ ర్యాలీలు నిషేదం



**మాకవరపాలెం, మే 25, మేజర్‌న్యూస్:** ఎన్నికల లెక్కింపు రోజున విజయోత్సవ ర్యాలీలు, సభలు నిర్వహిస్తే చర్యలు తప్పవని మాకవర పాలెం ఎస్సై రామకృష్ణారావు హెచ్చరిం చారు. ఎన్నికల నేపధ్యంలో 820 మందిని బైండోవర్ చేశామన్నారు. వీరంతా లెక్కింపు వరకు ఎలాంటి గొడవలు, అల్లర్లు సృష్టిస్తే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామన్నారు. లెక్కింపు రోజున బాణసంచా కాల్చరాదన్నారు. ఎవరైనా నిబంధనలు వ్యతిరేకిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.